

# అనిత

## సి. ఆనందారామం

"ప్రియమైన అత్తయ్యకి,

నేను రేపు బయలుదేరి మీ ఊరు వస్తున్నాను. అక్కడి మా పొలం వ్యవహారాలు పరిష్కరించుకొనే వరకూ మీ ఇంట్లోనే వుంటాను.

నమస్కారాలు.
నీ కోడలు.
అనిత........"

ఉత్తరం చదవటం పూర్తి చేసినా మతిపోయిన దానిలా చూస్తూ కూర్చుంది శారదమ్మ.

"ఏవిటమ్మా అది? ఎవరి దగ్గర నుండి?"

కుతూహలంగా అడిగాడు రాజారావు. ఉలిక్కిపడింది శారదమ్మ.

"అనిత రాసింది. ఇక్కడికి వస్తోందట!"

ఈ మాటలు వినగానే శారదమ్మకంటే ఎక్కువగా వులికిపడ్డాడు రాజారావు.

అతని కనుబొమలు ముడిపడ్డాయి. "అనిత రాసిందా? ఇక్కడికి వస్తోందా? ఎందుకు?"

"పొలం వ్యవహారాలు పరిష్కరించుకోడానికట!"

"దానికి ఆవిడెందుకు రావటం? మావయ్య రావచ్చుగా!"

శారదమ్మ సమాధానం చెప్పలేదు. బేలగా చూసి వూరుకుంది.

"మొగవాళ్ళు చేసుకోవలసిన పనులకి తను తయారవటం దేనికి? అంతేలే! ఎవరి సంతానం మరి!"

వెటకారంగా అన్నాడు రాజారావు.

అప్పటికీ శారదమ్మ మాట్లాడలేదు.

"మా ఇంట్లో దిగటానికి వీల్లేదని ఖండితంగా రాసెయ్యి. ఒంటరిగా పొలం వ్యవహారాలు పరిష్కరించుకోటానికి రాగలిగిన వ్యక్తి ఒంటరిగా నివసించ లేక పోలేదు."

కచ్చితంగా అన్నాడు రాజారావు.

శారదమ్మ ముఖం పాలిపోయింది.

కొన్ని క్షణాలు మాట్లాడకుండా వూరుకుని ఎలాగో గొంతు పెగల్చుకుని "పోనీ, రానియ్యరాదురా! కొన్నాళ్ళు మనింట్లో ఉంటుంది. నీ స్నేహితులెంతమంది ఎన్నిరకాల వాళ్ళు మనింటికి రావటంలేదూ? సొంత మేనకోడలు! ఆ మాత్రం ఉంచుకోలేమా?" అంది.

రాజారావు విస్తుపోయి చూశాడు. అతనికి జ్ఞానం వచ్చిన దగ్గర నుండీ చూస్తున్నాడు.

శారదమ్మ ఎన్నడూ ఎవరి మాటలకు అవుననికాని కాదనికాని అనలేదు.

ఆవిడ నోట్లో ఎప్పుడూ "అలాగే" అన్న పదం సిద్ధంగా వుంటుంది.

ఎవరేం చెప్పినా వెంటనే "అలాగే!" అనేస్తుంది.

భర్త బ్రతికి ఉన్నన్నిరోజులూ అలాగే అంది, కొడుకు ప్రాజ్ఞుడయి యాజమాన్యం స్వీకరించాకా అలాగే అంటోంది.

తల్లి ఈ బేలతనం చూసి రాజారావు అనేకసార్లు జాలిపడినా అప్పుడప్పుడు చికాకుపడక పోలేదు.

ముఖ్యంగా తండ్రి చేసిన అప్పుల జాబితాలు తలుచుకున్నప్పుడల్లా ఈ చికాకు ద్విగుణీకృతమవుతూ వుంటుంది.

తన తల్లి మరీ ఇంత అమాయకంగా అన్నింటికీ 'అలాగే' అనకుండా వుంటే తన తండ్రి ఇంత వ్యసనలోలుడయి ఇన్ని అప్పులు చేసేవాడు కాదేమో!

భర్తకు విధేయురాలై ఉండటం భార్యా ధర్మం కావచ్చు.

కానీ,

తన గృహాన్ని చక్కదిద్దుకోవటం గృహిణీ ధర్మం కాదా?

ఎప్పుడూ అన్నింటికీ గానుగెద్దులాగా తల ఊపే తల్లి ఈ నాడు స్వతంత్రించి ఇన్ని మాటలాడేసరికి ఆశ్చర్యంగా చూశాడు.

శారదాంబ ఏదో ఆవేశంలో అన్ని మాటలందే కాని వెంటనే తన మాటలకు తనే ఆశ్చర్యపోయి భయంగా పేలగా కొడుకు వంక చూసింది.

ఆ చూపులకు తట్టుకోలేక పోయాడు రాజారావు.

"సరే! రమ్మని రాయి."

అన్నాడు పొడిగా—

"నీకు కష్టంగా వుంటే........"

నట్టుతూ ఆగిపోయింది శారదమ్మ. "నాకు కష్టంగా వుంటే వుంటుంది. నాకు సాధ్యమయినంతవరకూ నీ యిష్టాన్ని కూడా గౌరవిస్తాను."

నడిచిపోతోన్న కొడుకును వెనుకనుండి చూసి లోలోపల నిట్టూర్పు విడుచుకొంది శారదాంబ.

అంతా తండ్రి రూపమే!

కానీ, స్వభావాలలో ఎంత వైరుధ్యం!

"నాకు సాధ్యమయినంతవరకూ నీ యిష్టాన్ని కూడా గౌరవిస్తాను."

ఎన్నాళ్ళకు వింది తను ఇలాంటి మాట!

మొదటినుండీ తనది సాత్త్విక స్వభావమే!

వాదాలకూ యుద్ధాలకూ కాలు తవ్వటం ఏనాడూ ఇష్టంలేదు.

ఏదో సందర్భంలో భర్త అభిప్రాయానికి వ్యతిరేకంగా ఏదో చెప్పబోయింది.

కస్సుమన్నాడు భర్త.

"బ్రతకటమెలాగో మాకు తెలుసు. ఈ నాడు నువ్వు నాకు బోధించక్కర్లేదు. నోరు మూసుకుని ఇల్లు చక్కదిద్దుకో!"

తన ప్రకృతి ఎంత సాత్త్వికమో, మనసంత సున్నితం.

ఆ రోజు మనసు తీవ్రంగా మధనపడింది. ఆ తర్వాత ఏనాడూ ఏ సందర్భంలోనూ తానై కలిగించుకోలేదు.

ఆ యాంత్రికమైన అలవాటు రానురాను తన వ్యక్తిత్వంలో ఒక భాగమై పిల్లల ముందు కూడా అలాగే నిలబడింది.

ఈ నాటికి తన రాజా 'నీ యిష్టాన్ని గౌరవిస్తాను' అంటున్నాడు.

ఎంతవరకు గౌరవిస్తాడు? తన అంతరాంతరాల్లో కోరిక నెరవేరుతుందా?

ఇంటిముందు ఒక్కసారిగా సందడి చెలరేగింది.

కన్న ఎందుకో అరుస్తున్నాడు.

కమల పకపక నవ్వుతోంది.

సుశీల ఇంట్లోకి వస్తూ కూడా పుస్తకం చదవటం మాన లేదు.

పిల్లలంతా ఇంటి కొచ్చారు.

శారదాంబ లేచింది.

పిల్లలకు త్వరగా కాఫీ ఫలహారాలు అందించాలనే ఆరాటంలో ఆవిడ ఆలోచనలు ఎక్కడి వక్కడ ఎగిరిపోయాయి.

## 2

"సుశీలా! రమణరావుగారు వచ్చారు. కాస్త ముఖం కడుక్కుని మంచి చీర కట్టుకుని బయటకురా!"

పిల్ల గదిముందు నిల్చుని అన్నాడు రాజారావు. సుశీల కనుబొమలు ముడుచుకున్నాయి.

అది గమనించీ లక్ష్యపెట్టకుండా "త్వరగా రా!" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్లు.

సుశీల విసుగ్గా లేచింది.

రమణరావును తలచుకొంటేనే శరీరం చీదరతో జలదరిస్తుంది సుశీలకు.

రమణరావు తెల్లాగానే వుంటాడు.

ఒడ్డూ, పొడుగూ కూడా వున్నాడు.

కానీ, అతని కళ్ళలో ఏదో క్రౌర్యం కనిపిస్తుంది సుశీలకి.

కొంతమంది కళ్ళూ ముక్కూ నోరూ అన్నీ బాగానే ఉన్నా చూడగానే యేదో విరక్తిభావం కలుగుతుంది.

అతని సమక్షంలో నుండి పరుగెత్తి పారిపోవాలనిపిస్తుంది.

కానీ, ఆ రమణరావుకే తనను కట్టిపెట్టాలని చూస్తున్నాడు అన్నయ్య.

రమణరావు పోలీస్ ఆఫీసర్ కొడుకు. చెప్పుకోదగినంత ఆస్తిపాస్తులు కలవాడు.

ఈ రెండు లక్షణాలతో రమణరావు అన్నయ్యకు బాగా నచ్చాడు.

తన అయిష్టం ఎంతగా వ్యక్తపరుస్తోన్నా పట్టించుకోవటం లేదు.

అన్నింటికంటే జానకి మాటలు తలుచుకున్నప్పుడల్లా భయం కలుగుతోంది.

రమణరావు పేరు వింటోనే ఎగిరిపడింది జానకి.

"రమణరావును ఎంతమాత్రం చేసుకోకు. నా మాట విను. బ్రతికినంతకాలం ఏడుస్తూ కూచోవాలి."

"ఏం? ఎందుకు?"

జానకి సమాధానం చెప్పలేదు.

"చెప్పు జానకీ!"

జానకి భుజాలు కుదుపుతూ అడిగింది.

జానకి సమాధానం చెప్పకపోగా ఏడ్చేసింది.

"నన్ను క్షమించు. ఒకవేళ మీ అన్నయ్య నిన్ను ఆ రమణరావుకే ఇచ్చి పెళ్ళి చేస్తాడేమో! అప్పుడు నేనేమీ చెప్పకూడదు. భగవంతుడి దయవల్ల అలా జరుగని పక్షంలో అంతా చెపుతాను. నీకు కాక ఎవరికి చెప్పుకుంటాను?"

ఈ మాటలన్నీ రాజారావుకు చెప్పెయ్యాలనిపించింది సుశీలకి.

కానీ చెప్పలేదు.

జానకితో మాట్లాడానని చెపితేనే మండిపడతాడు రాజారావు.

ఇంక జానకి మాటలకు విలువ ఇస్తాడా?

వద్దన్నా రహస్యంగా జానకితో • మాట్లాడుతున్నందుకు తనను చీవాట్లు పెడుతాడు.

జానకితో ఈ రహస్య సమావేశాలు కూడా కరువవుతాయి.

జానకి తల్లి ఒకప్పుడు తమ ఇంట్లో వంట మనిషి. వితంతువు.

ఆ తరువాత ఆవిడ గర్భవతి అయింది. జానకిని ప్రసవించింది.

జానకి తండ్రి ఎవరో ఎవరికీ తెలియదు. ఈ సంగతులు జరిగే నాటికి సుశీల పుట్టలేదు. అయినా ఆ నోటా, ఈ నోటా చాలా కథలు వింది.

జానకి తల్లి తులశమ్మ వంటపని మానేసింది. ఆవిడకు ఎలా వచ్చిందో ఏమో, వంటలు చేసుకోవలసిన అవసరం లేకుండా నాలు గెకరాల నిక్షేపంలాంటి మాగాణి వచ్చింది.

రాజారావు పసితనమంతా దర్జాగా గడిపాడు. కానీ తండ్రి కళ్ళు మూసి యాజమాన్యం వచ్చాక తమ సంసారపు దర్జా అంతా మేడిపండు వంటిదని తెలుసుకున్నాడు.

ఆస్తికి మించిన అప్పుల్ని చేసిపోయారు లక్ష్మీపతిగారు.

తల గిర్రున తిరిగింది రాజారావుకు. ఆ అప్పులన్నీ తీర్చి ఆస్తిని సంరక్షించట మెలాగా అన్నదే రాజారావును పట్టుకున్న పెద్ద సమస్య అయిపోయింది.

ఆ ధ్యేయంతోనే ఎద్దులా కృషిచేస్తున్నాడు. ఇంట్లో దర్జాలు తగ్గించుకోమని నచ్చజెప్పలేక సతమతమవుతున్నాడు.

కొడుకు నోటితో చెప్పకపోయినా అతడి మనసు అర్థంచేసుకుని వంటమనిషిని మాన్పించింది శారదమ్మ.

శారదమ్మ కే కాస్త నలతగా ఉన్నా, ఎలా తెలుసుకుంటుందో తులశమ్మ రెక్కలు కట్టుకు వాలి వంటంతా చేసి వెళుతుంది.

ఇది రాజారావుకు ఏమాత్రం నచ్చకపోయినా తల్లి అనారోగ్య పరిస్థితీ, ఇంట్లో పసిపిల్లల ఆలనా, పాలనా ఆలోచించి సహించి ఊరు కునే వాడు.

ఒక వితంతువు కూతురిగా పుడుతోనే అప్రతిష్ఠ నెత్తిన పెట్టుకు పుట్టిన జానకికి పులిమీది పుట్రలా మరో అనర్థం చుట్టుకొంది.


జానకి నిండు కోర్టులో ముద్దాయిగా నిలబడవలసి వచ్చింది.

డబ్బుకోసం ఎవరినో వలలో వేసుకోవాలని ప్రయత్నించిందనీ, అతను అడిగినంత డబ్బు ఇయ్యకపోవడం వలన, పోలీసులను పిలిచి అల్లరి పెట్టాలని ప్రయత్నించిందనీ కేసు—

తనను ఎవరో దుండగులు బలాత్కారంగా కారులో లాక్కుని వెళుతోంటే సహాయం కోసం "పోలీస్! పోలీస్!" అని అరిచానని కన్నీళ్ళతో జానకి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది.

జానకిని దోషిగా ఋజువు చేసింది కోర్టు. ఈ వార్త పత్రికలలోకి ఎక్కింది.

జానకి ఎంత సౌమ్యురాలో బాగా తెలిసిన వాళ్ళు కూడా జానకిని చూడగానే చెవులు కొరుక్కునేవారు.




"ఏమోనమ్మా! ఆ తల్లికి కూతురు కాదూ! ఏం జరిగిందో ఎవరికి తెలుసు?"

అని సరదాగా చెప్పుకున్నారు.

జానకి నడివీధిలో తల యెత్తుకు నిలబడలేని పరిస్థితి వచ్చేసింది.

సుశీల కన్న జానకి ఒక సంవత్సరమే పెద్ద. ఇద్దరూ చిన్నప్పటి నుండీ కలిసి చదువుకున్నారు.

ఊళ్ళో గొడవకి వేగలేక జానకి చదువు మానుకొని మద్రాస్ వెళ్ళి పోతోంటే వెక్కి వెక్కి ఏడ్చింది సుశీల.

"ఏడవకు సుశీ! మనం అక్కచెల్లెళ్ళలా కలిసిమెలిసి తిరిగాం! కొంతకాలం మద్రాస్‌లో ఉండి అక్కడే చదువుకుని ఈ దుమారం కాస్త తగ్గాక మళ్ళీ ఇక్కడికి వస్తాను."

బాధగా అంది జానకి.

"అన్నీ మోసాలు! అబద్ధాలు! ఇలా లేనిపోని గాథలు పుట్టించి నీ బ్రతుకు బండలు చేస్తే వాళ్ళకేం వస్తుందని?"

ఉక్రోషంతో అంది సుశీల.

"అబద్ధాలని నువ్వూ నేనూ అరిస్తే నిజాన్ని అబద్ధంగా మార్చగలి గిన వాళ్ళు భయపడతారా? ఆపదలో రక్షకదళాన్ని పిలిచినందుకు వాళ్ళీవిధంగా నన్ను భక్షించారు."

కన్నీళ్ళతో విడిపోయిన జానకీ సుశీలలు మళ్ళీ అయిదేళ్ళకి కలుసు కున్నారు.

జానకి పూర్తిగా మారిపోయింది.

వెనుకటి ఉత్సాహం చిలిపితనం ఎగిరిపోయి పూర్తిగా ఉదాసీనంగా తయారయింది.

ఊళ్ళో వెనుకటి ఉధృతం తగ్గినా జానకిని చూడగానే చెవులు కొరుక్కోటం మానలేదు.

రాజారావుకు జానకి పట్ల ఆర్ద్రభావం లేకపోలేదు.



చిన్నతనం నుంచీ అతను జానకిని సొంత చెల్లెలిలా అభిమానించాడు.

జానకిని దోషిగా అతని అంతరంగమూ ఊహించలేకపోతోంది.

కానీ, జానకి అల్లరిపడింది. కోర్టులకెక్కి పత్రికలపాలయి నలుగురి నోళ్ళలో నానింది.

అతనికి అన్నింటికంటె తన కుటుంబక్షేమమూ సమాజంలో ప్రతిష్ఠా ముఖ్యం.

ఆ కారణంచేత జానకితో మాట్లాడటానికి వీల్లేదని సుశీలను కఠినంగా శాసించాడు.

పాపం! జానకి రమణరావును గురించి చెప్పిన మాటలు సుశీల రాజారావుకు ఎలా చెప్పగలదు?

## 3

నల్లని చీర కట్టుకుని తాటికాయంత బొట్టు పెట్టుకుని విసుగు నణచుకునే ప్రయత్నంలో చిరాకు ఎక్కువకాగా హాల్లోకి వచ్చింది సుశీల.

"హలో! సుశీలా దేవీ!"

ఎంతో సభ్యతతో పలకరించాడు రమణరావు.

అదేం పాపమో, రమణరావు ఏది చేసినా, ఏం మాట్లాడినా కృతకంగానే అనిపిస్తుంది సుశీలకి!

"హలో!" అంది పొడిగా.

"నే నిప్పుడే వస్తాను."

కావాలని సుశీలా రమణరావులను వదిలి వెళ్ళిపోయాడు రాజారావు.

సుశీల మనసులో గుర్రుమంది.

రాజారావు ఉద్దేశం అర్థంచేసుకున్న రమణరావు సుశీల వైపు తిరిగి చిరునవ్వు నవ్వాడు.

సుశీల తిరిగి నవ్వలేదు.

ముఖం తిప్పుకుంది.

అన్న దగ్గిర లేడు గనుక తన తిరస్కారాన్ని సాధ్యమయినన్ని విధాల ప్రకటించడానికే సిద్ధపడింది సుశీల.

సుశీలలో ఈ సంచలనం రమణరావు అర్థంచేసుకోకపోలేదు.

కానీ సుశీల సౌందర్యం అతడికి పిచ్చెక్కిస్తోంది.

అదీగాక రాజారావు ఆస్తిని గురించే తప్ప అప్పుల గురించి తెలియదు. రాజారావు లాంటి ఐశ్వర్యవంతుడి చెల్లెల్ని- అందాలరాణిని సుశీలని—ఈ తిరస్కారాలకి భయపడి వదులుకో దలచలేదు రమణరావు.

"మీరీ నల్ల చీరలో చాలా అందంగా ఉన్నారు. నాకు నలుపంటే ఇష్టం." అన్నాడు.

వొళ్ళు మండింది సుశీలకు—

"నాకు నలుపంటే అసహ్యం. నాకు ఇష్టంలేని వ్యక్తుల దగ్గిరకు విధిగా వెళ్ళాల్సి వస్తే, ఈ నల్ల చీర కట్టుకుంటాను."

తల తిరిగింది రమణరావుకు. ఎంతయినా సుశీల తన అనిష్టాన్ని ఇంత స్పష్టంగా ప్రకటిస్తుందని అనుకోలేదు.

పాలిపోయిన రమణరావు ముఖం చూసిన సుశీల లోలోపల చప్పట్లు చరుచుకొంది.

కానీ, రమణరావు అంతకూ ఇంతకూ నిరుత్సాహపడే రకం కాదు.

సుశీల కోపాన్నంతనూ సరసం క్రింద మారుస్తూ "ఆడవారి మాటలకు అర్థాలు వేరులే!" అన్నాడు చిలిపి నవ్వుతో....

నిర్ఘాంతపోయింది సుశీల.

అతనిమీద చీదరింపు మరింత ఎక్కువయింది.

అతని ముఖం చూడటం ఇష్టం లేక చేతి కందిన విశ్వనాథవారి చెలియలికట్ట చదువుతూ కూర్చుంది.

"ఏవిటి చదువుతున్నారు?"

"చెలియలికట్ట!"

"ఏం వస్తుంది, ఆ పుస్తకాలు చదివితే? కూడు పెడతాయా? గుడ్డ పెడతాయా?"

"కూడూ, గుడ్డా తప్ప జీవితంలో ఇంకేమీ లేదా?"

"ఎందుకు లేదూ? గుఱ్ఱపు పందేలున్నాయి. ఎంత సరదాగా ఉంటుందీ? వస్తే లక్షలొస్తాయి."

"లేకపోతే చిప్ప చేతికొస్తుంది."

"వస్తే వస్తుంది. జీవితంలో కష్టపడి సంపాదించి ఏనాటికి ఐశ్వర్యవంతులం కాగలం? అదృష్టం కలిసొస్తే ఇలాగే రావాలి."

"ఒక్కటి మరిచి పోతున్నారు. అదృష్టమనేది మనను వెతుక్కుంటూ వచ్చేది. మనం వెతుక్కుంటే దొరికేది కాదు."

"అదృష్టం సంగతేమో కాని, ఐశ్వర్యం మాత్రం మనం సాధించి పొందవలసిందే!"

ఆ మాటలలో ఆసక్తిలేని సుశీల తిరిగి పుస్తకంలో తలదాచుకుంది.

"నేనూ చదువుతాను పుస్తకాలు. కానీ ఇలాంటి చెత్త పుస్తకాలు చదవను. మంచి మంచి పుస్తకాలు చదువుతాను."

పుస్తకాలలో ఆసక్తిగల సుశీల చటుక్కున తలెత్తి "ఏం పుస్తకాలు?" అంది.

"ఖాతా పుస్తకాలు, పద్దు పుస్తకాలు, లాటరీ పజిల్స్, చెక్ పుస్తకాలూ........"

పకపక నవ్వింది సుశీల.

అప్పుడే లోపలకు వచ్చిన రాజారావు సుశీల నవ్వు చూసి "ఏవిటి నవ్వుతున్నావ్?" అన్నాడు.

"మీ స్నేహితుడు అత్యంత ఉత్తమ సాహిత్యమంటే ఏమిటో చెప్తున్నారు. వింటే నవ్వాగలేదు."

"ఏమిటీ?"

"ఖాతా పుస్తకాలు!"

రాజారావు పెదవులపైన చిరునవ్వు విరిసింది. సుశీల గడియారం చూసుకుని విముక్తిపొందిన దానిలా లేచి "అన్నయ్యా! నేను సంగీతం క్లాసు కెళ్ళాలి. టైమయిపోతోంది." అంది.

"వెళ్ళిరా!" అన్నాడు రాజారావు.

"ఎందుకండీ, ఆడపిల్లలకు సంగీతం? కూడు పెడుతుందా? గుడ్డ పెడుతుందా? అంతకన్న ఇంట్లో పనిపాటలు నేర్చుకుంటే మేలు!"

రాజారావు ముఖం గంభీరం కావటంచూసి తను పొరపాటుగా మాట్లాడానని నొచ్చుకున్నాడు, రమణరావు.

సుశీల సహించలేకపోయింది.

"లలితకళలు కూడూ, గుడ్డ పెట్టవు. నిజమే! అవి మనసు కొక మధురమైన ఆనందాన్ని కలిగిస్తాయి. గుఱ్ఱపు పందేలూ, లాటరీలు తప్ప మరొకటి తెలియని వాళ్ళకి ఆ ఆనందం అర్థం కాకపోవటంలో ఆశ్చర్యం లేదు. అది వాళ్ల దురదృష్టం!"

"సుశీలా!" అన్నాడు రాజారావు మందలిస్తున్నట్లు—

సుశీల మాట్లాడకుండా అక్కడినుండి వెళ్లిపోయింది.

## 4

ఆ రోజే అనిత వస్తోంది. శారదమ్మ ఒకటే హడావుడి పడ్తోంది. చాలా రోజుల తర్వాత ఆవిడ మనసు ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. శారదమ్మకు దగ్గిర దగ్గిర సంవత్సరం క్రిందట జరిగిన సంఘటన గుర్తొచ్చింది.



-సెక్రటరీ! ఆయనకు ఏం కావాలో కనుక్కో - శాంక్షన్ చేద్దాం !!

తలవని తలంపుగా వచ్చిన అన్నను చూసి ఆశ్చర్యపోయింది శారదమ్మ.

పిచ్చిదానిలా చూస్తోన్న శారదమ్మను చూసి ఆప్యాయంగా తల నిమురుతూ "నేనే శారదా! ఏమిటలా చూస్తావ్?" అన్నాడు దయాశంకర్ నవ్వుతూ.

"అన్నయ్యా! నువ్వేనా? వచ్చావా? ఎన్నాళ్లకు కనిపించావ్?"

పెదవులపై చిరునవ్వు కళ్లలో కన్నీళ్ళు చిందిస్తూ అంది శారదమ్మ.

"ఎప్పుడో వచ్చేవాణ్ని. మీరు రానిస్తే........"

శారదమ్మకు కలుక్కుమంది. సమాధానం చెప్పలేని స్థితిలో తల వంచుకుంది.

దయాశంకర్ ఒక ఆంగ్లో ఇండియన్ యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ రోజుల్లో అది బంధువర్గంలో పెద్ద దుమారం రేపింది.

భార్యను తీసుకుని చెల్లెలి ఇంటికి వచ్చాడు దయాశంకర్.

లక్ష్మీపతి వీధి తలుపులు వేసేసి "నేను పరువు ప్రతిష్ఠలతో బ్రతుకుతున్నవాడిని. నీ ఇష్టమొచ్చినట్లు నువ్వు ఊరేగు. నా ఇంట్లో మాత్రం అడుగుపెట్టకు. నా బ్రతుకు బజారుపాలు చెయ్యకు." అన్నాడు.

తనదైన వ్యక్తిత్వం ఏనాడో చంపుకున్న శారదమ్మ బొమ్మలా నిలబడి పోయింది.

తన భార్యతో వీధిలోంచే తిరిగి వెళ్ళిపోయిన దయాశంకర్ ఇరవై ఏళ్ల తరువాత తిరిగి ఆ ఇంటికి వచ్చాడు.

"వదినను తీసుకొచ్చావా?"

"మీ వదినను నీ కసలు తెలియదు గనుక ఈ ప్రశ్న అడిగావు. ఆవిడ కెంత ఆత్మాభిమానమో తెలుసా? ఆ కంఠంలో ప్రాణం ఉండగా తనను అవమానించిన ఇంట్లో అడుగు పెడుతుందా? ఆవిడను పైలోకానికి సాగనంపాకే ఇక్కడికి వచ్చాను."

ఈ మాటలంటున్నప్పుడు దయాశంకర్ కంఠం సన్నగా వణికినా పెదవులు మాత్రం నవ్వుతూనే ఉన్నాయి.

శారదమ్మ ఈ మాటలు విని నిజంగానే నొచ్చుకుంది.

తన అన్నగారి జుట్టు అంతగా నెరిసిపోవటానికీ, ముఖం బాగా ముడతలు పడటానికీ వృద్ధాప్యం కారణం కాదని అప్పుడు అర్థమయింది.

"అయ్యయ్యో! అన్నయ్యా! పాపం, నీకు...."

దయాశంకర్ చేయెత్తి చెల్లెల్ని వారించాడు.

"శారదా! ఆగాగు. ఇప్పుడు నేను వచ్చింది పరామర్శలు చేయించుకోవడానికి కాదు. పెళ్లి సంబంధాలు వెతకటానికి........"

శారదమ్మ పిచ్చిపట్టిన దానిలాగ చూసింది.

"ఏవిటీ? పెళ్లి సంబంధాలా? నువ్వు మళ్ళీ ఈ వయసులో...."

విరగబడి నవ్వాడు దయాశంకర్....

"పిల్లనిచ్చే వాడుంటే నేనూ చేసుకుంటాను. కానీ పెళ్ళి సంబంధాలు వెతక వలసింది నాకు కాదు. అనితకి—"

"అనిత ఎవరు?"

"ఓ! నీకసలు ఏమీ తెలియదు కదూ! అనిత నా కూతురు. బంగారు బొమ్మ. ఫొటో చూడు."

అనిత ఫోటో శారదమ్మ కిచ్చాడు దయాశంకర్.

"ఎంత బాగుంది! అచ్చు హిందువుల పిల్లలాగా—" ముచ్చట పడింది శారదమ్మ.

"అవును. దానికి అన్నీ మన అలవాట్లే వచ్చాయి. నేను రోజాను పెళ్లి చేసుకున్నప్పుడు అందరూ "నీకు పిల్లలు పుడితే పెళ్లెలా చేస్తావ్?" అని భయపెట్టారు.

ఆ మాటలు రోజాతో చెప్తే రోజా నవ్వేసి "మనలాగే వాళ్ళు ప్రేమించి పెళ్లి చేసుకుంటారు," అనేసింది. అదే బాగుందని ఇన్నాళ్లూ నిశ్చింతగా ఉన్నాను. ఈ అనిత ఉందే, ఇది నా ప్రాణం తీసింది."

"ఏం? ఎవరిని ప్రేమించింది?"

భయంగా అడిగింది శారదమ్మ.

పకపక నవ్వాడు దయాశంకర్.

"ప్రేమిస్తే బెంగదేనికి? సుఖంగా అది కోరిన వాడికిచ్చి పెళ్లి చేసేవాడిని. అది ఎవరినీ ప్రేమించలేదు. 'నీ యిష్టం నాన్నా! నువ్వు ఎవరిని చేసుకోమంటే వాళ్ళను చేసుకుంటాను' అంది...."

"ఎంత మంచి పిల్ల!" మురిసిపోయింది శారదమ్మ.

"మంచిదా? రణగొండిరాలుగాయ? ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో చెప్పు. వచ్చినట్లు సంబంధాలు వెతుకుతున్నాను. ఈ ఊళ్ళో ఒక సంబంధం ఉందని విని వచ్చాను. పెళ్ళికొడుకు...."

దయాశంకర్ మాట పూర్తి కాకుండానే రాజారావు వచ్చాడు.

"ఇతనెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు దయాశంకర్.

"మా పెద్దబ్బాయి రాజారావు. లా పాసయి ఈ ఊళ్ళోనే లాయరుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇటు పొలం పనులు కూడా వాడే చూసుకుంటున్నాడు. వీడి తరువాతది సుశీల బి. యస్. సి చదువుతోంది. దీనికీ పెళ్లి చెయ్యాలనుకుంటున్నాం. సంబంధం ఇంచు మించు కుదిరినట్లే: ఆ తరువాతది కమల ఫోర్తుఫారం చదువుతోంది. ఆఖరివాడు కన్న. సెకండ్ ఫాంలో ఉన్నాడు."

"బాగుంది!"

రాజారావునే చూస్తూ ఆలోచిస్తూ అన్నాడు దయాశంకర్.

"రాజా! ఈయన మీ మావయ్య."

రాజారావు దయాశంకర్‌ని ఎన్నడూ చూడకపోయినా అతని గురించి విన్నాడు. నమస్కారంచేసి "అత్తయ్యగారిని కూడా తీసుకొచ్చారా?" అన్నాడు మామూలు మర్యాద సూచకంగా—

"ఆహా! పరవాలేదోయ్! మా కంటె మీరే నయం. మీ నాన్న మమ్మల్ని వీధిలోంచే వెళ్ళకొట్టాడు. నువ్వు ప్రేమగా అత్తయ్యగారిని కూడా తీసుకు రమ్మంటున్నావ్! ప్చ్! ఈ మార్పు చూసే అదృష్టం ఆవిడకు లేదయ్యా! పై లోకానికి వెళ్ళిపోయింది."

"అయామ్ సారీ!"

"దట్సాల్ రైట్!"

"మీ ఆరోగ్యం బాగుందా?"

"దివ్యంగా ఉంది. శారదా! ఒక దివ్యమైన ఆలోచన! మన రాజారావుకే అనిత నిచ్చి పెళ్ళిచేస్తే...."

రాజారావూ, శారదమ్మా, ఇద్దరూ తెల్లబోయారు.

"ఇదిగోనయ్యా! మా అనిత ఫొటో చూడు...."

నిర్లక్ష్యంగా క్రిందపడెయ్యాలనుకున్న రాజారావు ఆ ఫొటోమీంచి కొన్ని క్షణాలవరకూ చూపులు తిప్పుకో లేకపోయాడు. అప్రయత్నంగా దానిని జేబులో వేసుకున్నాడు.

"మేనల్లుడని నీకేం లోపం చెయ్యను. వాళ్ళమ్మ తన డబ్బు లక్ష రూపాయలు అనితపేర బేంక్‌లో వేసింది. అది అనిత కుటుంబంకోసం తప్ప మరే సందర్భంలోనూ వాడకూడదని గట్టి నియమం చేసింది. ఆలోచించుకుని సమాధానం చెప్పు."

శారదమ్మ కళ్ళు మెరిసాయి. ఆవిడకు అన్నగారంటే మొదటినుంచీ చాలా ఆపేక్ష. ఆ ఆంగ్లో ఇండియన్ వదినగారు పోనే పోయింది. అనితను తన కోడలిగా చేసుకుంటే రెండు కుటుంబాలూ కలుస్తాయి. తమ కుటుంబానికి ఒక అండ ఏర్పడుతుంది.

కానీ రాజారావు ముఖం మాత్రం గంభీర మయింది.

"క్షమించండి. మీ అమ్మాయిని నేను చేసుకోలేను." అన్నాడు.

తెల్లబోయాడు దయాశంకర్.

"అదేవిటయ్యా! అమ్మాయి నచ్చలేదా? ఫొటోలో కంటె చాలా బాగుంటుంది."

"అంత అందమైన అమ్మాయిని ఎక్కడా చూడలేదు."

"మరి, ఇంకా కట్నం కావాలా?"

"కట్నానికి నేను ఆశపడటం లేదు."

"ఇంకేమిటి నీ అభ్యంతరం? కొంపతీసి నువ్వెవరినైనా ప్రేమించావా?"

"చిన్న తనంలోనే బాధ్యతలన్నీ నెత్తినబడి ప్రేమించడానికి తీరిక లేకపోయింది మావయ్యా?"

దయాశంకర్ పకపక నవ్వి "మరి, ఎందుకు కాదంటున్నావో కారణం చెప్పు." అన్నాడు.

"ఒక ఆంగ్లో ఇండియన్ యువతి కూతుర్ని నేను పెళ్ళి చేసుకోలేను."

ఎగిరి కూర్చున్నాడు దయాశంకర్.

"వాట్? ఇందాకటినుంచీ మాటల్లో అంత సంస్కారం వలకబోసి........"

"సంస్కారం మాటల్లోనే కాదు మావయ్యా! మనసులోనూ ఉంది. ఎవరైనా ఇలాంటి పెళ్ళి చేసుకుంటే మనసారా అభినందిస్తాను."

"భలే సంస్కారం!"

హేళనగా అన్నాడు దయాశంకర్.

"అవును. కొన్ని కొన్ని సంస్కారాలు భలేగానే ఉంటాయి. ఒక కుటుంబానికి యజమానిగా నా బాధ్యతలు గుర్తించే సంస్కారం కూడా నాకుంది. నేను మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే నా చెల్లెళ్ళకు పెళ్ళి కావటం కష్టం. మన సంఘం ఈ నాటికీ కబుర్లలో ముందుకు దూకుతున్నంత కార్యాచరణలో ముందుకు దూకటం లేదు....ఆగండి! మీరనబోయేది నాకు తెలుసు. మీ డబ్బూ హోదా నాకు సహకరిస్తాయంటారు. కానీ, అది నా కిష్టంలేదు."

దయాశంకర్ ముఖంలో హేళన ఎగిరిపోయింది. వాత్సల్యంగా రాజారావు వీపుతట్టి "శభాష్!" అని శారదమ్మతో "ఆణిముత్యం లాంటి కొడుకుని కన్నావు శారదా!" అన్నాడు.

ఈ ప్రశంసకు శారదమ్మ పొంగిపోయినా, రాజారావు అనితను కాదనటం నచ్చలేదు ఆవిడకు. అయినా ఎప్పటిలాగే ఏమీ అనలేకపోయింది.


ఆరోజే దయాశంకర్ వెళ్ళిపోయాడు.

ఆనాటికీనాడు సంవత్సరం తరువాత అనిత దగ్గరనుండి ఈ ఉత్తరం....

అనిత చాలా అందంగా ఉంటుందిట! అనిత వచ్చాక... ....అనిత రాజారావుకి నచ్చితే....వాళ్లిద్దరికీ పెళ్లి జరిగితే....ఇలా తియ్యతియ్యగా సాగిపోయాయి శారదమ్మ ఆలోచనలు....అటు రాజారావుకీ ఇంచుమించు ఇలాంటి ఆలోచనలే వచ్చాయి.

అనితను చేసుకోమని మావయ్య తనను అడిగాడు. తను కాదన్నాడు. అనిత ఫొటో తనకి చూపించినట్లే తన ఫొటో అనితకు చూపించి ఉండవచ్చు. ఆ ఫొటో చూసి తనను ఎలాగైనా ఆకర్షించాలని వస్తోందా అనిత?

ఆ రాత్రంతా అనిత తనను ఆకర్షించాలని చూస్తున్నట్లూ తను ఆ ఆకర్షణనుండి తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లూ కలలు కంటూ కలత నిద్రపోయాడు రాజారావు.



## 5

స్కూటర్‌మీద స్టేషన్‌కి వెళ్లిన రాజారావు ఎంతో ఆతృతతో ప్రతి కంపార్ట్‌మెంటూ గాలించాడు!

తను ఫొటోలో చూసిన ఆ సుందరమూర్తి ఎక్కడా కనిపించలేదు.

ఒక్క క్షణం నిరుత్సాహంతో డీలా అయిపోయాడు.

తనకు కలిగిన నిరుత్సాహానికి తనే ఆశ్చర్యపోయాడు రాజారావు.

తనకు తెలియకుండానే తన మనసు అనిత రాక కోసం ఇంతగా ప్రతీక్షిస్తోందా?

రాజారావు స్కూటర్ చప్పుడు వినగానే ఇంటిల్లపాతీ బిలబిలలాడుతూ బయటకు వచ్చారు.

అందరూ ఒక్కసారే "అనిత ఏదీ?" అని అడిగారు.

"రాలేదు."

అందరి ముఖాల్లోనూ నిరుత్సాహం స్పష్టంగా కనపడింది.

శారదమ్మ మరీ దిగులు పడింది.

"రాలేదా? ఎందుకు రాలేదు?"

"బాగుంది. నా కెలా తెలుస్తుంది?"

చిరాకు పడ్డాడు రాజారావు.

ఆ చిరాకు, ఎదురు చూసిన అనిత రానందుకని తెలియని శారదమ్మ అనిత రావటం రాజారావుకు ఇష్టంలేదని భావించి లోలోపల నొచ్చుకుంది. అంతలోనే ఇంటిముందు కారాగింది.

కారులోంచి దేవలోకం నుండి దిగి వచ్చిన అప్సరసలా అనిత దిగి నిల్చుంది.

అప్రయత్నంగా ముందుకు రెండడుగులు వేశాడు రాజారావు.

అతని ముఖంలో వికాసం శారదమ్మకు ఆశ్చర్యం కలిగించినా సంతృప్తినీ ఇచ్చింది.

అనిత శారదమ్మ దగ్గిరకు వచ్చి పాదాలకు నమస్కారం చేసింది.

అనిత రూపు రేఖలకే మురిసిపోతున్న శారదమ్మ ఈ చర్యతో మరింత పొంగిపోయింది.

అనితను ఆశీర్వదించి లేవనెత్తింది.

"నువ్వు రాలేదని అనుకుంటున్నాం!" అంది.

"రాకుండా ఎలా వుంటాను? మిమ్మల్నందరినీ ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆరాటపడుతున్నాను."

ఈ మాటలు అనిత ప్రత్యేకం రాజారావును చూస్తూ అంది.

రాజారావు కళ్ళు మెరిశాయి. చిరునవ్వులో గర్వరేఖ తొంగి చూసింది.

అనిత సుశీలనూ, కమలనూ, కన్ననూ, పేరు పేరున పలకరించింది.

"వదినా! నువ్వు వచ్చినందుకు నాకు చాలాచాలా సంతోషంగా వుంది." మనసారా అంది సుశీల.

"బావకు మాత్రమే కాస్త కష్టంగా ఉన్నట్లుంది," రాజారావు వంక కొంటెగా చూస్తూ అంది అనిత.

"లేదు. లేదు. నాకూ సంతోషంగానే ఉంది. బంధువులు ఇంటికొస్తే ఆదరించగలిగే సంస్కారం నాకు లేకపోలేదు."

రాజారావు గంభీరంగా అనడానికి ప్రయత్నించినా అతనా మాటలు ఉప్పొంగే సంతోషంతో అన్నాడని అతని కళ్ళు చెప్పక చెపుతున్నాయి.

"నువ్వు కారులో వచ్చావా?"

కుతూహలంగా అడిగింది కమల.

"అవును. కారులోనే రావలసివచ్చింది. ఏం చెయ్యను? రాణితో ట్రైయిన్ ప్రయాణం చాలా ఇబ్బంది."

"రాణి ఎవరు?"

శారదమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

రాజారావు, సుశీల కుతూహలంగా చూశారు.

"నా కూతురు. రా రాణీ!"

అనిత డోర్ తెరిచి పట్టుకుంది. నాలుగేళ్ళ పాప అనిత చెయ్యి పట్టుకుని క్రిందకు దిగింది.

శారదమ్మ నెత్తిన పిడుగు పడింది.

రాజారావు కాళ్ళ క్రింది భూమి కంపించింది.

సుశీల ముఖం పాలిపోయింది.

కన్న, కమల, చంటిపాపను చూసిన ఆనందంతో చప్పట్లు కొట్టారు.

"నీ కూతురా?"

శారదమ్మ మళ్ళీ అడిగింది.

"అవునత్తయ్యా! నా కూతురు. బాగుంది కదూ! మా నాన్నగారు ఇది చాలా ముద్దుగా ఉంటుందంటారు."

"చాలా బాగుంది."

కన్న, కమల ఏక కంఠంతో వప్పుకున్నారు. "మీ నాన్నగారు నీకు పెళ్ళి కాలేదని చెప్పారు......." కంఠం వణుకుతుండగా అంది శారదమ్మ.

"అవునత్తయ్యా! ఇంకా నాకు పెళ్ళి కాలేదు."

తల గిర్రున తిరగసాగింది రాజారావుకు. సుశీల వణికే క్రింది పెదవుని మునిపంటితో నొక్కి పట్టుకుంది.

"మరి....మరి....కూతురెలా పుట్టిందీ?" అయోమయంగా అడిగింది శారదమ్మ.

పకపక నవ్వింది అనిత.

"ఇంత వయసొచ్చి పిల్లలెలా పుట్టారని అడుగుతున్నావా అత్తయ్యా!"

ఆ వయసులో శారదమ్మ సిగ్గుతో చితికిపోయింది. పెళ్ళి కాకుండా తల్లి కావటమే కాక తన సంతానాన్ని చేత్తో పట్టుకుని నిర్లక్ష్యంగా నవ్వుతోన్న ఆ సుందరమూర్తిని పిచ్చి పట్టినవాడిలా చూశాడు రాజారావు.

"ఆ పాపకి తండ్రి ఎవరు?"

అతని కంఠంలో పలికింది క్రోధమో, అసూయో, అసహ్యమో సరిగా అర్థంకాలేదు.

"అది చెప్పగలిగేస్థితిలో నే నుంటే నా కింత ప్రయాసదేనికి? సమయం సందర్భం కుదరగానే మీ కందరికీ అన్నీ చెపుతాను. అంత వరకూ నన్నేమీ అడగకండి...."

"మీరీ ఇంట్లో వుండటానికి వీల్లేదు——"

లోపలకు వెళ్ళబోతున్న అనిత రాజారావు కటు సర్వం విని ఆగిపోయింది.

వెంకిగా కవ్విస్తున్నట్లు రాజారావును చూస్తూ "మీ బంధువులను ఆదరించగలిగే సంస్కారం మీ కుందన్నారు కదూ ఇప్పుడే! క్షణాని కొక మాటా మీకు?"

రాజారావు తడబడ్డాడు.

"కానీ. కానీ....మీరు...."

"ఊఁ! నేను?"

నడుం మీద చేతులాన్చి విలాసంగా నవ్వుతూ నిర్లక్ష్యంగా చూస్తోన్న ఆ మధురమూర్తిని క్షణకాలం మైమరచి చూస్తూ నిలబడిపోయాడు రాజారావు.

పకపక నవ్వింది అనిత.

రాజారావు వులికిపడి లజ్జ పడ్డాడు.

"మీ పాపకు ఇక్కడ సరిగా జరగదు."

"రాణికి ఆయా వుంది. ఇంకాసేపట్లో వస్తుంది. ఇక్కడ దాని బంధువు లున్నారట! అక్కడ దిగింది. రోజూ ప్రొద్దున్నే వచ్చి సాయంకాలంవరకూ చూసి నిద్రపుచ్చి వెళ్ళిపోతుంది."

"మీ కారుకిక్కడ షెడ్ లేదు."

"ఆ ఏర్పాటుకూడా చూసుకున్నాను. నా కారూ కేశవరావుగారింట్లో వుంటుంది, డ్రైవరూ అక్కడే వుంటాడు."

"కేశవరావంటే, రమణరావు తండ్రి...."

"అవును........"

"ఆయన మీకు తెలుసా?"

"ఇంతకు ముందు తెలియదు. ఈ ఊరు రావాలని నిర్ణయించుకున్నాక తెలుసుకున్నాను."

అనితను చూస్తున్నకొద్దీ విభ్రమం కలుగసాగింది రాజారావుకి-

"ఆఖరు ఆటంకం కూడా చెప్పండి. నేను ఉండటంవల్ల మీకు ఇబ్బందని....దానికి నా సమాధానం....నా ఖర్చు నేనే భరించుకుంటాను."

ఈ మాటలు రాజారావు అహాన్ని గుచ్చాయి. "అక్కర్లేదు. మీ అంత ఐశ్వర్యవంతులం కాకపోయినా తిండికి లేనివాళ్ళం కాము."

"అయితే నేను వుండటానికి అభ్యంతరం ఏం లేనట్లేగా!"

"ఉంది. అప్రతిష్ఠ........"

"నా వల్ల మీకేం అప్రతిష్ఠ? నేను మీ భార్యను కానుగా........"

విస్తుపోయి చూస్తోన్న రాజారావును దాటుకుంటూ చిరునవ్వుతో లోపలికి వెళ్ళిపోయింది అనిత........

## 6

అనిత సాధించవలసిన పనులు చాలా వున్నాయి. అందులో యేది ముందో యేది వెనుకో ఆలోచించుకుంటోంది.

ముందుగా జానకిని కలుసుకుంది.

జానకి ఆప్యాయంగా అనితను కౌగలించుకుని "బాగున్నావా? రాణి కూడా వచ్చిందా?" అంది.

"ఆ! నాతోకూడా తీసుకువచ్చాను."

"ఎవ్వరూ ఏమీ అనలేదూ?"

"అనకుండా ఎందుకుంటారు?"

"ఎలా తట్టుకున్నావ్ మరి! అసలా ఇంట్లోకి ఎలా అడుగు పెట్టగలిగావ్? రాజారావు అన్నయ్య........"

"మీ రాజారావు అన్నయ్య నన్ను సకల మర్యాదలతో ఆహ్వానించాడు. ఆయన తన బంధువులను ఆదరించి తీరుతాడట!"

తనలో తను చిలిపిగా నవ్వుకుంది అనిత.

"నమ్మలేక పోతున్నాను. రాణి సంగతి తెలిసాక నిన్ను యింట్లో ఉండనిచ్చాడా అన్నయ్య?"

"నన్ను ఒకరు ఉండనిచ్చేదేమిటీ? ఆ ఇంటి కోడల్ని!"

గర్వంగా అంది అనిత.



"నీ మాట యదార్థం కావాలి అనితా! అప్పుడు నా కంటే ఎవరూ ఎక్కువ సంతోషించరు."

ముఖం సంతోషంతో వెలిగి పోతుండగా అంది జానకి.

"నా సంగతి వదిలెయ్యి. నీ సంగతి ఆలోచించు. అందుకే వచ్చాను. నే నొక ప్రణాళిక ఆలోచించాను."

జానకి ముఖంలో వికాసం ఎగిరిపోయింది.

"మనిద్దరం క్లాస్‌మేట్స్ కావటం నా అదృష్టం. అనితా! నీకు నా మీద గల ప్రేమకు ఎంతో పొంగిపోతున్నాను. కానీ, ఏ ప్రణాళికలూ నా అదృష్టాన్ని మార్చలేవు...."

"అదిగో! ఆ ఏడుపు ముఖమే నా కిష్టంలేదు. భగవంతుడు మనకు జీవితాన్నిచ్చింది నవ్వుతూ త్రుళ్ళుతూ గడపటానికి........"

"అందరికీ ఆ అదృష్టం పట్టదు అనితా!"

"ప్రయత్నం చెయ్యకుండా నిరాశపడితే ఎలా?"

"ఏం చెయ్యమంటావ్?"

"మా ఇంటికి—అదే, మా మేనత్తగారింటికి, రమణరావు ఎప్పుడు వస్తాడో తెలుసుకుని నీకు చెపుతాను. అప్పుడు నువ్వూ సరిగ్గా అక్కడకు రావాలి."

"రాలేను. అలాచేస్తే సుశీలకి, రాజారావు అన్నయ్యకీ కష్టం కలుగుతుంది."

"సుశీలకి కష్టం కలగకుండా నేను వివరిస్తాను. రాజారావు బావకెందుకు కష్టం కలుగుతుందీ?"

జానకి మాట్లాడకుండా పెదవి పంటితో కొరుక్కుంటూ కన్నీళ్లాపుకుంటూ కూర్చుంది.

అనిత అసహనంగా "బావకు విషయం తెలుసా?" అంది.

"తెలిసే ఉంటుంది."

"తెలిసే నిన్ను అసహ్యించుకుంటున్నాడా?"

"సంఘంలో పరువు ప్రతిష్టలు ముఖ్యం కాదా మరి? నేను అల్లరి పాలయినదానిని...."

"అలా మాట్లాడకు. నాకు చాలా అసహ్యంగా ఉంది. నువ్వు నిరపరాధివని తెలిసే సంఘంలో ప్రతిష్టకోసం చెల్లెలిలా అభిమానించే నిన్ను దూరంగా ఉంచాలనుకుంటున్నాడా రాజారావు? అతని మనసు మార్చాలని ప్రయత్నించావా నువ్వు?"

"లేదు. అన్నయ్య మనసు కష్టపెట్టలేను."

"కష్టపెడుతున్నానేమో ననే భ్రమతో నిన్ను సరిగా అర్థం చేసుకునే అవకాశం బావ కియ్యటంలేదు నువ్వు. కష్ట పెట్టుకుంటే పెట్టుకోనీ! కొన్ని విషయాలు అతనికి తెలిసిరావాలి...."

జానకి గాభరా పడింది.

"వద్దు! వద్దు! అనితా! సుశీల మనసు తెలియకుండా ఏ విషయమూ బయట పెట్టకు."

అప్పటి వరకు మౌనంగా వింటోన్న తులశమ్మ కలిగించుకొంది.

"ఒకసారి తనను తను రక్షించుకోవాలని ప్రయత్నించి ఇంత ఊబిలోకి దిగింది. ఇంకా ఎందుకమ్మా, ఈ ప్రయత్నాలు? మరే రంగులు పులుముతారో? పోనీలే! అన్యాయాలూ, అపనిందలూ సహించటం మా కలవాటైపోయింది."

"సహిస్తున్న కొద్దీ అక్రమాలు ఎక్కువవుతాయి కాని తగ్గవు. ఇంకా ఇరవై కూడా నిండని జానకి జీవితం ఇలా నాశనం కావలిసిందేనా? ఏం జానకీ! నువ్వు నా మాట వింటావా లేదా? నేను వెళ్ళిపోనా?"

"వింటాను. కానీ నా కారణంగా సుశీలకు, రాజారావు అన్నయ్యకు ఏ ఇబ్బందీ రానీయకూడదు."

"అలాగే! కానీ బావకు నీ స్థితి అర్థమయ్యేలా నువ్వు వివరించి చెప్పు. మరీ అంత మూర్ఖుడు కాడు."

"మా అన్నయ్య మూర్ఖుడు కానే కాడు."

రోషంగా అంది జానకి....

పకపక నవ్వింది అనిత....

"ఇంత అభిమానం గుండెల్లో దాచుకుని ప్రయోజనం లేదు. కార్యాచరణలో చూపించు. సుశీలను కాపాడాలని లేదా నీకు?"

చివరి మాటతో జానకి ఆలోచనలో పడింది. "సరే! నువ్వెలా చెపితే అలా వింటాను."

అనిత ఉత్సాహంతో తులశమ్మ దగ్గిర సెలవు తీసుకుని లేచింది.

స్కూటర్ మీద ఇంటికి వెళుతున్నాడు రాజారావు.

"బావా!" అని పిలిచింది.

రాజారావు ఆగిపోయాడు.

"ఎక్కడ్నుంచి వస్తున్నావ్?"

"జానకి దగ్గిర నుంచి!"

"జానకి!! నీకు తెలుసా?"

"తెలుసు. మే మిద్దరం మెడ్రాస్‌లో బి. యస్. సి. చదువుతున్నాం...."

"మీరు మెడ్రాస్‌లో స్నేహితులయితే అయ్యారు. ఇక్కడ మాత్రం నువ్వా ఇంటికి రాకపోకలు చెయ్యడానికి వీల్లేదు."

"ఎందుకు బావా?"

అమాయకంగా అడిగింది.

"నీకు తెలిసే ఉండాలి...."

"నాకు తెలిసినంతవరకూ జానకి దగ్గిర కెళ్లటం ఏ విధంగానూ లజ్జ పడవలసిన కార్యం కాదు."

"ఇది మెడ్రాస్ కాదు. ఇక్కడ నీకు తెలియని సంగతులు చాలా ఉన్నాయి. నేను నొక్కి చెపుతున్నాను. నా కుటుంబంలో వ్యక్తులెవరూ నా మాట కాదనటానికి వీల్లేదు."

"హమ్మయ్య! అయితే బ్రతికి పోయాను. నేను బంధువుని మాత్రమే! కుటుంబంలోని వ్యక్తిని కాను. భార్య, చెల్లెళ్లు, తమ్ముళ్లు, తల్లి, తండ్రి, వీళ్ళే కుటుంబంలో వ్యక్తులు."

గుర్రుమన్నాడు రాజారావు.

"నువ్వు నా ఇంట్లో ఉంటున్నంతవరకూ మా మర్యాద కాపాడాలి."

"తప్పకుండా కాపాడతాను. ఆ ప్రయత్నంలోనే రాణిని కూడా తీసుకొచ్చాను."

రాజారావు ముఖం ఎఱ్ఱగా కందిపోయింది రోషంతో.

నవ్వు నాపుకోవటానికి ప్రయత్నిస్తూ పైట చెంగు నోటి కడ్డం పెట్టుకుంది అనిత.

అది చూసిన రాజారావుకు మరింత మండింది.

"నీ కసలు లజ్జ అంటే ఏవిటో తెలుసా?"

"తెలియదు. లజ్జ పడవలసిన పనులు నే నెప్పుడూ చెయలేదు. నీకు తెలుసా? చెప్పవూ?"

"నువ్వు.... నువ్వు...."

కోపంతో పిడికిలి బిగించి మాట పూర్తి చేయలేకపోతున్నాడు రాజారావు.

"నీ మరదల్ని...."

నమ్రతతో అందించింది అనిత.

కాల్చేసేలా ఒక్కసారి అనితను చూసి తల విసురుగా తిప్పుకొని స్కూటర్ స్టార్ట్ చేశాడు రాజారావు.

"అబ్బా!" అని క్రింద కూలబడింది అనిత....

రాజారావు స్కూటర్ దిగి గాభరాగా "ఏం జరిగింది?" అన్నాడు.

"క్రింద పడిపోయాను. కాలు నరం పట్టేసింది. అడుగుతీసి అడుగు వెయ్యలేకపోతున్నాను."

"ఏదీ, చూడనీ...."

కాలు మీద చెయ్యి వెయ్యబోయాడు రాజారావు.

"అబ్బా!" అని కెవ్వున కేక వేసింది అనిత.

బాధతో విలవిలలాడుతున్న అనిత ముఖం చూస్తోంటే జాలితో నిండిపోయింది రాజారావు మనసు.

"జాగ్రత్తగా స్కూటర్ మీద కూర్చోగలవా? ఇంటికెళ్ళి డాక్టర్ని పిలిపిస్తాను."

"ఎందుకు బావా! నీ కనవసరపు శ్రమ!"

"ఇందులో శ్రమ ఏముంది? లే!"

"వద్దులే! నువ్వెళ్ళు—నా పాట్లు నేను పడతాను. లేవలేకుండా ఉన్నాను."

జాలిగా రాజారావును చూస్తూ అంది అనిత....

రాజారావు అనితను లేవదీసి స్కూటర్ మీద కూర్చోబెట్టాడు.

ఓపిక లేనిదానిలా రాజారావు మీద వరిగి కూర్చుంది అనిత........

స్కూటర్ మీద యింటికొచ్చిన అనితా రాజారావులను చూసి శారదమ్మ, సుశీల ఆశ్చర్యపోయారు.

ఆ ఆశ్చర్యాన్ని గమనించిన రాజారావు సిగ్గుపడుతూ, సంజాయిషీ ఇచ్చుకొంటున్నట్లు "అనితకు పెద్ద దెబ్బ తగిలిందమ్మా! నడవలేక పోతోంది. అందుకే...." అని ఏదో చెప్పబోతుండగానే అనిత చెంగున గెంతి "అన్నీ వట్టిది అత్తయ్యా! కొద్దిగా కాలు జారింది అంతే! నేను వద్దు మొర్రో అంటోన్నా బావే నన్ను లేవదీసి స్కూటర్ మీద కూర్చోబెట్టుకుని తీసుకొచ్చాడు. పాపం! నన్ను తన స్కూటర్ మీద తీసుకురావాలని సరదా పడ్డాడు కాబోలు," అంది.

రాజారావు విస్తుపోయి చూశాడు.

"నువ్వు ఎంతకైనా తగినదానివి!" అన్నాడు కసిగా.

"అయ్యో బావా! పాపం, నీకు నన్ను గురించి ఏమీ తెలియదు కదా!"

రాజారావు మీద జాలి ప్రకటించింది కొంటె నవ్వుతో అనిత.

## 7

రాణితో సహా అనిత దిగగానే ఒక్కసారిగా శారదమ్మ ఆశలన్నీ నేల మట్టమయి పోయాయి.

ఎవరినైనా అభిమానించటమే కాని, ద్వేషించటం తెలియని సత్య కాలపు మనిషి ఆవిడ.

పెళ్ళి కాకుండానే కూతుర్ని కని నిర్లక్ష్యంగా నించున్న అనితను చూసి కంగారు పడిందే కాని, ద్వేషించలేకపోయింది.

రాజారావు అనితను వీధిలోంచే వెళ్ళగొడతాడని భయపడింది.

విచిత్రంగా అనిత తమ ఇంట్లో స్థానం సంపాదించటంతో మరింత విస్తుపోయింది.

"బామ్మా!" అంటూ దగ్గర కొచ్చిన పసిపాపను చీదరించుకో గలిగే కాఠిన్యం శారదమ్మలో లేకపోయింది.



క్షణాలలో రాణి శారదమ్మ దగ్గర చనువయిపోయింది.

అనిత రాణికోసం కుదిర్చిన ఆయా లక్ష్మమ్మ ఇంటి పనులన్నీ చక్కబెడుతోంటే శారదమ్మ రాణితో కబుర్లు చెప్పుకుంటోంది.

కన్నకూ, కమలకూ రాణి రావటం చాలా సంతోషంగా వుంది. రాణి తనతో రకరకాల ఆట సామానులు తెచ్చుకుంది. ఆ ఆట సామానులు చూస్తే కన్నకు కమలకు వళ్ళు తెలియటం లేదు.

ఒక సారి రాణి "మావయ్యా!" అంటూ రాజారావు చేతిలో బిస్కట్ పెట్టబోయింది.

"చ! నన్ను 'మావయ్యా!' అని పిలవకు," అన్నాడు చికాగ్గా రాజారావు.

"మరి, ఏమని పిలవను?"

అమాయకంగా అడిగింది రాణి.

అక్కడే వున్న అనిత కలిగించుకుని "నాన్నా! అని పిలు. పాపం! అలా పిలిపించుకోవాలని ఆశగా ఉంది కాబోలు!" అంది.

"నాన్నా!"

ముద్దుగా అంది పాప.

కమల, కన్న, చప్పట్లు కొట్టారు.

రాజారావుకు వళ్ళు తెలియని కోప మొచ్చింది.

"నేను నీ నాన్నని కాను."

"మరి. ఎవరు మా నాన్న?"

"మీ అమ్మ నడుగు."

"అమ్మ నువ్వని చెప్పిందిగా!"

"అనితా! ఏమి టిది?"

"ఏ ముంది?"

"ఛ! ఛ! ఈ పాపను ఇక్కడి నుండి తీసుకుపొండి. ఒక్క క్షణం శాంతి లేదు."

"అంత అశాంతి ఎందుకు బావా! నువ్వు ప్రేమించిన అమ్మాయి నిన్ను చేసుకోనందా?"

"నోరు మూసుకో! ప్రేమించటం తప్ప నాకు వేరే పని లేదు."

"నీకు తీరుబడిగా ఉన్న సమయం చూసుకొని కలుగుతుందేమిటి ప్రేమ?"

"అందరూ నీలా ఎవరు కనిపిస్తే వాళ్ళను ప్రేమించరు."

"ఓహో! నువ్వు కనపడక ముందునుంచీ ప్రేమిస్తున్నావన మాట. కలలో చూసావా? ఊహలో చిత్రించుకున్నావా? ఫొటో చూసావా?"

"అనితా! మాటలు జాగ్రత్తగా రానీయ్!"

"అతి జాగ్రత్తగా నీ మనసులో నిజాల్ని తాకేలా మాట్లాడుతున్నాను గనుకనే నీ కింత కోపం వస్తోంది. కదూ, బావా!"

"నువు.... నువ్వు...."

"నీ మరదల్ని...."

రోషంతో పళ్ళు కొరుకుతూ తడుముకొంటూన్న రాజారావుకు నమ్రతతో అందించింది అనిత.

విసురుగా లేవబోయిన రాజారావు కాలికి తగిలి రాణి క్రింద పడి ఏడుపు మొదలు పెట్టింది.

రాజారావు గాభరాగా రాణిని లేవనెత్తి ఎత్తుకుని బుజ్జగించి అతి కష్టంమీద ఓదార్చాడు.

ఎంతో సేపటికి రాణి ఏడుపు మాని కళ్ళు తుడుచుకుంది.

రాణిని దింపి వెళ్ళబోయాడు రాజారావు. అంతలో ఏదో గుర్తు వచ్చిన వాడిలా ఆగి "సుశీలా! త్వరగా తయారవు. ఇవాళ మూడు గంటలకు రమణరావుగారు వస్తున్నారు," అని చెప్పి వెళ్ళిపోయాడు.

రమణరావు పేరు వింటోనే అనిత కళ్ళు మండాయి. సుశీల కళ్ళు చీదరించుకున్నాయి. "వదినా! నీ కున్న ధైర్యంలో పదో వంతు నాకుంటే ఎంత బాగుండును? ఈ పీడ వదిలించుకునే దానిని...."

అనిత భుజంమీద చెయ్యి వేసి దిగాలుగా అంది సుశీల.

అనిత ముఖం ఉత్సాహంతో వెలిగింది. తన భుజంమీది సుశీల చెయ్యి ఆప్యాయంగా నొక్కుతూ "అంటే రమణరావు మీద నీకేమీ ప్రేమ లేదా?" అంది.

"ప్రేమా? పాడా? వాడంటే నాకు అసహ్యం!"

"మరి, ఆ మాట మీ అన్నయ్యతో ఎందుకు చెప్పకూడదు?"

"హమ్మో! అన్నయ్యంటే నాకు చాలా భయం."

"అంత చండశాసనుడా మీ అన్నయ్య?"

"నీకు తెలియదు వదినా! మా నాన్నగారు అప్పుల సముద్రంలో వదిలిన ఈ కుటుంబాన్ని గట్టుకు తేవటానికీ మమ్మల్నందరినీ వృద్ధిలోకి తేవటానికీ అన్నయ్య ఎంత పాటుపడుతున్నాడో ఊహించలేవు."

"అన్ని అప్పులున్నాయా మీకు?"

"నీకు పుణ్యం ఉంటుంది. మళ్ళీ అన్నయ్యతో చెప్పకు. మాకు అప్పులున్న సంగతి మరొకరికి తెలియటం, అన్నయ్య కిష్టంలేదు. ఇప్పుడు మేమున్న స్థితిలో పెద్ద కట్నాలిచ్చి నాకు మంచి సంబంధం తేవటం తేలికైన పనికాదు అన్నయ్యకి. అంచేత రమణరావు తనంతట తను నన్ను ఇష్టపడుతున్నందుకు ఆనందిస్తున్నాడు. నేను గట్టిగా కాదంటే బలవంత పెట్టడు- కాని బాధ పడతాడు."

"మీ అన్నయ్య బాధపడతాడని నీకు ఇష్టంలేని పెళ్ళి చేసుకుని జీవితాంతం బాధపడతావా?"

"ఏం చెయ్యమంటావు మరి?"

"మీ అన్నయ్యతో స్పష్టంగా ఇష్టంలేదని చెప్పక్కర్లేదు. నేను చెప్పినట్లు చెయ్యి. రమణరావు పరుగెట్టి పారిపోతాడు."

"అంత తేలిక కాదు. మొహంమీద ఉమ్మేసినా తుడుచుకు నవ్వే రకం...."

"నీ కెందుకూ? నా మాట విను...."

"అన్నయ్యకు ఎదురు తిరగక్కర్లేకుండా ఆ రమణరావును తప్పించుకునే ఉపాయమేదైనా సరే, తప్పకుండా వింటాను...."

"రైట్! నువ్వు అందంగా అలంకరించుకో!"

"ఛ! వాడి దగ్గిరకు వెళ్ళటమే మంటగా ఉంటే అలంకారా లొక్కటా?"

"అది కాదు. అలంకరించుకో! నువ్వు వ్యతిరేకిస్తున్నట్లు మీ అన్నయ్యకు తెలియకూడదు. ఆ రమణరావుతోనే చెప్పిస్తాను. మీ సుశీల నాకు వద్దని...."

సుశీల ఆశ్చర్యంగా చూసింది.

## 8

అత్యంత ఆకర్షణీయంగా అలంకరించుకున్న సుశీలను చూసి ముగ్ధుడయ్యాడు రాజారావు.

చెల్లెలు తన సూచనకు మనసారా అంగీకరిస్తున్నదని తృప్తి పడ్డాడు.

సుశీల ప్రక్కనే ఏ అలంకారాలూ లేకపోయినా మెరుపుతీగెలా మెరుస్తున్న అనితనూ, అనితకేసి కళ్ళప్పగించి చూస్తున్న రమణరావునూ చూసేసరికి మతిపోయింది రాజారావుకి. అతని గుండె కలుక్కుమంది.

తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

"అనితా! మీ రైతులు సరిగా శిస్తులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నావు కదూ! ఆ వ్యవహారాలు చూసుకుందాం, వస్తావా?" అన్నాడు.

అనిత వెంటనే లేచింది.

"పద!"

గడప దాటీ దాటగానే అనిత పేచీ మొదలు పెట్టింది.

"నేను నడవలేను. మా కారులో వస్తావా? నీ స్కూటర్ మీద తీసి కెళ్తావా?"

అనిత కారులో వెళ్ళటానికి రాజారావు అభిమానం అడ్డొచ్చింది.

"నీ స్కూటర్ మీదే వెళ్దాం!"

స్కూటర్ బయలుదేరాక రాజారావు మీదికి వంగి "పాపం! నన్ను నీ స్కూటర్‌మీద తిప్పాలని మీ కంత ముచ్చటగా ఉందా?" అంది పెంకెగా....

రాజారావు గుర్రుమని "కాసేపు మాట్లాడక కూర్చోండి. ఏ పొలానికి తీసి కెళ్ళమంటారో చెప్పండి," అన్నాడు.

"ముందా బహువచనం మానండి. తరవాత ఏదైనా పార్కుకి నడపండి."

"పిచ్చి వేషాలు వెయ్యకు!"

"నువ్వు నన్ను బయలుదేరదీసింది మా పొలాలకోసం కాదని నాకూ తెలుసు. కాదని ఒట్టు పెట్టుకు చెప్పు—"

క్షణంకాలం రాజారావు మాట్లాడలేక పోయాడు.

"పార్కుల వెంట తిరగటానికి అసలు కాదు."

"మరి, దేనికో?"

"నీ బారినుండి ఆ రమణరావును తప్పించడానికి—"

పకపక నవ్వింది అనిత.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఇలా స్కూటర్ వెనుక కూర్చుని నీతో మాట్లాడలేను. నన్నెక్కడికయినా అందమయిన చోటికి తీసికెళ్ళు. మీకు గులాబితోట ఉందటగా! అక్కడికి తీసికెళ్ళు—"

"నాకు పనిలేదు—"

"పనివున్నా, కొన్ని సందర్భాల్లో మానుకోవాలి. మీ చెల్లెలి క్షేమం నిజంగా కోరినవాడివైతే తీసికెళ్ళు—"

"దీనికీ మా చెల్లెలి క్షేమానికీ ఏం సంబంధం?"

"నేను స్కూటర్‌మీద కూచుని అరవలేను."

రాజారావు నిర్లక్ష్యంగా ఉండాలని నటించినా అతనికి సాధ్యం కాలేదు. తమ గులాబితోటలోకి తీసికెళ్ళి "చెప్పు!" అన్నాడు కూర్చుని.

అనిత గులాబులను చూస్తూ "అబ్బ! ఎన్నిరకాల గులాబులను తెప్పించారు? తోట చాలా అందంగా ఉంది." అంది.

"ఏదో చెప్తానన్నావు. త్వరగా చెప్పు."

విసుగ్గా అన్నాడు.




"నాకు దాహం వేస్తోంది."

"ఇంటి కెళ్ళాక మంచినీళ్ళు త్రాగుదువు గాని...."

"ఈ లోగా దాహంతో నాకు ప్రాణం పోతుంది. నీకు స్త్రీ హత్యా పాతకం చుట్టుకుంటుంది."

"అబ్బ!"

విసుక్కుంటూ లేచిన రాజారావును పచ్చగడ్డిమీద సగం వొరిగి కొంటెగా చూస్తూ "బావా! కొబ్బరి నీళ్ళు తెచ్చిపెట్టు" అంది అనిత.

అనిత వంక కొరకొర చూసి వెళ్ళి కొబ్బరి బొండా కొట్టించి నీళ్ళు గ్లాసులో పోసి తెచ్చిపెట్టాడు.

"నువ్వు చాలా మంచి వాడివి బావా!"

రాజారావు తెచ్చిన నీళ్ళు తాగేసి అంది.

"ఏదో చెప్తానన్నావు."

"ఈ అందమైన సాయంకాలం, ఇంత అందమైన తోటలో అంత కన్న అందంగా ఉన్న నీ ఎదురుగా కూర్చుని ఈ సమయాన్ని పిచ్చి కబుర్లతో పాడుచెయ్యమంటావా?"

"అనితా! ఎవరనుకుంటున్నావు నన్ను?"

"అది తెలుసుకోవాలనేగా ఇక్కడి కొచ్చాను నేను?"

"ఏమిటీ?"

"స్కూటర్ మీద ఎక్కించుకుని ఈ ఏకాంత ప్రదేశానికి తీసుకు రావటం నీకు బాగుంది కాని మాట్లాడటం నాది తప్పొచ్చిందా?"

రాజారావు వుద్రేకంగా అనిత రెండు చేతులూ గట్టిగా పట్టుకుని "వాగుడు కట్టిపెట్టి ఏదో చెప్తానన్నావ్! చెప్పు!" అన్నాడు.

"అబ్బబ్బ! చేతులు వదులు. ఎవరూలేరని ఏవిటీ అత్యాచారం? పరపురుష స్పర్శ నేను భరించలేను."

రాజారావు చటుక్కున చేతులు వదిలి ముఖమంతా ఎర్రబడగా "అయామ్ సారీ!" అన్నాడు.

ఆ ముఖంలోకి ఆర్ద్రంగా చూస్తూ "నా బారినుండి రమణరావును కాపాడటానికి తీసుకువచ్చావా నన్ను?" అంది.

"అవును."

"నా బారినుండి కాపాడతావు సరే! నా లాంటివాళ్ళు—నా కున్న అందంతోపాటు నాకు లేని చాంచల్యం కూడా కలిగినవాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళందరి బారినుండీ కాపాడగలవా?"

తెల్లబోయాడు రాజారావు.

"లాయరుగారి మెదడు కోర్టులోనే తప్ప తక్కిన ప్రదేశాలలో పనిచెయ్యదా? నీకు ప్రధానమైనది ఏమిటి? నీ చెల్లెలికి పెళ్ళి కావటమా? ఆవిడ సుఖంగా ఉండటమా?"

"పెళ్ళి చేసుకుని సుఖంగా కాపురం చెయ్యటం—"

"నిజంగా నీ ఉద్దేశం అదే అయితే రమణరావుకి సుశీలను ఇస్తానవు."

"ఏం? రమణరావుకు ఏం తక్కువయిందీ?"

"ఏం తక్కువో నీకు కూడా తెలుసునని నన్ను అతని ముందు నుంచి తప్పించి తీసుకురావటంలోనే అర్థమయింది. అది తెలుసుకుని కూడా సుశీలను అతడికే ఇద్దామనుకుంటున్నావా? నీ బరువు దించుకోనటమే నీకు ప్రధానమా? ఆ తరువాత సుశీల కష్ట సుఖాలు నీ కక్కర్లేదా?"

రాజారావు లోలోపల మధనపడి అపరాధిలా అనిత వంక చూస్తూ "పెళ్ళయ్యాక ఇలాంటి చాపల్యాలు సర్దుకుపోవా?" అన్నాడు.

"సర్దుకోకపోతే?"

రాజారావు సమాధానం చెప్పలేకపోయాడు. వడిలిపోయిన అతని ముఖంలోకి సంతృప్తిగా చూస్తూ "నిన్ను మరొక్కటి అడుగుతాను చెప్పు," అంది.

"అడుగు."

"నీకు సుశీలమీద మాత్రమేనా ప్రేమ? నీ చెల్లెళ్ళందరి మీదా ఉందా?"

"ఇంటి పెద్ద కొడుకుని. మా నాన్నగారు కుటుంబ బాధ్యతలన్నీ నా మీద వదిలి వెళ్ళారు. నా చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, అందరి మీదా నాకు ప్రేమ ఉంది. వాళ్ళను వృద్ధిలోకి తీసుకురావటమే నా ఏకైక ధ్యేయం."

అనిత ఏదో మాట్లాడబోయిన దానిలా పెదవి కదిపి అంతలో తనను తను నిగ్రహించుకుంటున్న దానిలా ఊరుకుంది.

"ఏమిటది?"

"ఇప్పుడు చెప్పవలసిన విషయం కాదు."

"పోదాం పద!"

అనితా రాజారావులు ఇంటికొచ్చేసరికి సుశీల హుషారుగా రేడియో వింటోంది. రమణరావు లేడు.

రాజారావు ఆశ్చర్యంగా "రమణరావుగారు ఏరీ?" అన్నాడు.

"నువ్వు వెళ్ళిపోయిన పది నిముషాలకే వెళ్ళిపోయారు."

"అదేం? నువ్వు ఏమైనా……"

"రామ! రామ! ఉండమని ఎంతో ప్రాధేయపడ్డాను. వంట్లో బాగుండలేదుట! వెళ్ళిపోయారు."

"వంట్లో బాగుండలేదా?"

రాజారావు త్వరత్వరగా రమణరావును చూడటానికి వెళ్ళిపోయాడు.

సుశీల, అనిత, ఒకరి చేతులొకరు పట్టుకుని విరగబడి నవ్వుకున్నారు.

## 9

రమణరావు శరీరంనిండా స్వేదజలం క్రమ్ముకొంది. ముఖం పాలిపోయింది. పెదవులు వణుకుతున్నాయి. కళ్ళు చలిస్తున్నాయి. కొన్ని క్షణాలలో కొన్ని సంవత్సరాలు జబ్బుపడ్డ మనిషిలా అయిపోయాడు.

"రమణరావుగారూ! ఏమిటి వంట్లో సుస్తీ?"

ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

రమణరావు బెంబేలుగా రాజారావును చూస్తూ "సుస్తీయా? వంట్లోనా? నాకా? లేదే! ఏం లేదు." అన్నాడు.

"మరి, సుశీల మీకు వంట్లో సుస్తీ అని చెప్పిందే! మీరు అలాగే కనిపిస్తున్నారు."

"సుశీల చెప్పిందా? అలా కనిపిస్తున్నానా? అవును. సుస్తీ! ఏదో సుస్తీ చేసింది."

"ఎందుకలా కంగారు పడుతున్నారు? ఏం జరిగింది? మా ఇంటికి వెళ్దాం రండి."

"మీ ఇంటికా? వద్దు! వద్దు! రాను! రాను!"

"అదేమిటీ? మా యింటికి రారా?"

"రానంటే వస్తాను. వస్తానంటే ఇప్పుడు రాను. ప్లీజ్! నన్ను క్షమించండి. మీరు వెళ్ళండి. ప్రస్తుతం నేనేం మాట్లాడలేను. తరువాత మాట్లాడుకుందాం!"

రాజారావు ఆశ్చర్యంగా చూసి ఏదీ అర్థంకాక వచ్చేశాడు.

"రమణరావుగారికి ఎలా ఉందన్నయ్యా!" ఎంతో ఆదుర్దాగా అడిగింది సుశీల.

"ఏమోనమ్మా! ఎందుకో గాభరాగా కనిపిస్తున్నాడు. అడిగితే చెప్పటంలేదు. ఇక్కడేమైనా జరిగిందా?"

"చెప్పుకోదగిన సంఘటన ఏదీ జరగలేదే! జానకి వచ్చింది. అకస్మాత్తుగా లేచి వెళ్ళిపోయారు."

"జానకి వచ్చిందా?"

కోపంగా అడిగాడు.

"అవును. అమ్మకు గుండెలో నొప్పివస్తే సేవ చెయ్యటానికి వచ్చింది. వంట చేసి అమ్మకు కాపడం పెట్టి ఇప్పుడే వెళ్ళింది."

రాజారావు కోపం మంచులా కరిగిపోయింది. "దౌర్భాగ్యురాలు?" అన్నాడు బాధగా నుదురు రాసుకుంటూ.

అనిత ఉద్రేకంగా లేచింది.

"జానకి కాదు దౌర్భాగ్యురాలు! ఈనాటి మన సామాజిక వ్యవస్థ దౌర్భాగ్యపుది! దానికి ప్రతినిధులమయిన మనం దౌర్భాగ్యులం!"

"మనం చేసే పాడు పనులకు సమాజం ఏం చేసింది?"

"పాడుపనులు చేసింది ఎవరు? డబ్బూ అధికారం ఉన్న పెద్ద మనుష్యులుగా చెలామణీ అవుతున్న కొందరు. ఆ అక్రమాన్ని సహించి ఊరుకొంది సమాజం. అంటే మనం! మధ్యన నలిగిపోయేది జానకి లాంటి అమాయకులు!"

"జానకిది తప్పులేదనే అనుకుందాం. ఒంటరిగా పార్కుకి వెళ్ళ వలసిన అవసరం ఏమొచ్చింది?"

"బాగుంది నీ వాదన! ఒంటరిగా పార్కుకి వెళ్ళిన స్త్రీకి రక్షణ లేని సమాజమనమాట మనది! సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోలేక వెనక్కి చీకటిలోకి పారిపోదామంటావా? అబలలకూ బలహీనులకూ రక్షణ కల్పించవలసిందిపోయి వారిని వెలుతురు చూడకుండా దాక్కోమంటావా? దుర్మార్గాన్ని ఖండించేబదులు దానికి దూరంగా పారిపోయి ఆ దుర్మార్గాన్ని యధేచ్ఛగా పెరగనిస్తావా?"

"కోర్టులో జానకి దోషిగా ఋజువయింది. పత్రికలన్నింటిలో ఈ వార్త వచ్చింది. ఊరంతా ఉడికింది. ఇప్పుడు జానకిని ఎలా కాపాడ గలను?"

"నువ్వు లాయర్‌వి. జానకి కేసు విచారణ నాటికి నువ్వు డిగ్రీ తీసుకోలేదు గనుక మన న్యాయస్థానాలలో మర్మాలు తెలియకపోవచ్చు. కానీ ఈనాడు నీకు బాగా తెలిసి ఉండాలి. కోర్టులు తీర్పులు ఎల్లవేళలా న్యాయానికే బద్ధమయి ఉంటున్నాయా? రాజ్యాధికారాన్నే డబ్బుతో కొంటున్న యీ యుగంలో న్యాయాన్ని కొనలేరా?"

లోలోపల మథన పడుతున్నట్లు రాజారావు బొమలు ముడుచుకున్నాయి. కొంచెంసేపు ఏదీ మాట్లాడలేక పోయాడు. చివరకు ఒక స్థిర నిశ్చయానికి వచ్చిన వ్యక్తిలా లేచి నించున్నాడు.

"వ్యక్తిగతంగా నా ఆశయాలూ అభిరుచులూ వేరు. గౌరవనీయమైన కుటుంబపు పెద్దగా నా బాధ్యతలు వేరు. జానకిని నా సొంత చెల్లెలిలా అభిమానించాను. కాని ఈ నాటి స్థితికి మనసారా బాధ పడుతున్నాను. కానీ జానకి ఇక్కడికి రావటానికి వీల్లేదు. మీరు అక్కడికి వెళ్ళటానికీ వీల్లేదు. నా చెల్లెళ్ళకు మంచి సంబంధాలు కుదిరి పెళ్ళిళ్ళవ్వాలి. అన్నిటికంటె అదే నా ప్రధానమైన ధ్యేయం...."

అనిత ముఖం చూడలేనివాడిలా గబగబ వెళ్ళిపోయాడు రాజారావు.

అనిత, సుశీల ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు.

"ఎలా వదినా?" అంది సుశీల దిగాలుగా.... అనిత సమాధానం చెప్పలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంది.




## 10

కన్నకూ, కమలకూ ఇద్దరికీ ఒక్కసారే కడుపునొప్పి వచ్చింది. కడుపు చేత్తో పట్టుకుని చెరోమూలా పడుకున్నారు.

"కడుపు నొప్పా? డాక్టర్ని పిలుస్తాను," అంది అనిత.

ఇద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

"వద్దు! వద్దు! వదినా! డాక్టర్ని పిలవకు. అదే తగ్గిపోతుంది."

అనిత నిదానించి ఇద్దర్నీ చూసింది. ముఖంలో ఎక్కడా బాధ పడుతున్న లక్షణాలు లేవు....

అంతలో శారదమ్మ అక్కడికి వచ్చి "కన్నా, కమలా! ప్రైవేట్ మాస్టారు వచ్చారు. లేచి పుస్తకాలు తీసుకురండి." అంది.

ఇద్దరూ ఒక్కసారే "అబ్బ! కడుపునొప్పి!" అని మూలగ సాగారు.

అనితకు వాళ్ళ కడుపునొప్పి ఏమిటో అర్థమయిపోయింది.

బయటకు వచ్చి చూసింది. చేతిలో పేము బెత్తంతో కూర్చున్నారు పిలక మాస్టారు.

ఆ పేము బెత్తానికీ పిల్లల కడుపునొప్పికీ గల దగ్గిర సంబంధాన్ని చిటికెలో ఊహించుకొంది అనిత.

"పిల్లలకు కడుపు నొప్పిట మాస్టారూ! వాళ్ళురారు. మీరు వెళ్ళిపొండి." అంది అనిత.

"కడుపునొప్పీ, గిడుపునొప్పీ, అంతా పట్టిది, ఇలా పిలవండి. రెండు వడ్డిస్తే అన్నీ చక్కబడతాయి."

అనితకు చిరాకు కలిగింది.

"వాళ్ళు రారని చెప్తోంటే మీక్కాదూ! వెళ్ళిపొండి."

అని కసిరి లోపలికి వెళ్ళిపోయింది.

మాస్టారి గుండెల్లో రాయి పడింది. ఈ పిల్లలు ఏ రోజు కారోజు ఇలాగే కడుపునొప్పి అంటుంటారు. ఇలా ప్రతిరోజూ వీళ్ళు ట్యూషన్

మానేస్తే తనకు ట్యూషన్ డబ్బులు రావు. ఈ ట్యూషన్లవల్ల ఏదో కాస్త గడుస్తోంది గాని, కేవలం బళ్ళో ఇచ్చే జీతం ఏ మూలకి?

తిన్నగా రాజారావు దగ్గిరకు వెళ్ళాడు....

"పిల్లలు కడుపునొప్పి అన్నారండి. మీ ఇంట్లో ఆవిడెవరో పిల్లల్ని ట్యూషన్‌కి పంపలేదు."

రాజారావుకు వల్లమాలిన కోపమొచ్చింది. విసురుగా లోపలికి వచ్చాడు.

"ఏదీ? ఆ దొరసానిగారు?"

కుట్టుకుంటూ కూర్చున్న సుశీల ఎదురుగా "ఎవరు? వదినా?" అంది.

"ఛ! అలా పిలవకు. ఎక్కడుందీ?"

"పిల్లలను తీసుకుని పార్కులోకి వెళ్ళింది."

"కడుపునొప్పి అన్నారుట?!"

"ఏమో, మరి!"

లోలోపల పళ్ళు నూరుకుంటూ తక్షణమే పార్కుకి వెళ్ళాడు రాజారావు.

కన్ననూ, కమలనూ, రాణినీ ఉయ్యాలలో కూర్చోబెట్టి ఊపుతోంది అనిత.

విరబోసుకున్న జుట్టు గాలికి ఎగురుతూ ముఖంమీద పడుతోంది. పైటకొంగు నడుంచుట్టూ దోపి తనూ ఒక చిన్నపిల్లలా నవ్వుతోన్న అనిత సుందరమూర్తిని చూస్తూ కొన్నిక్షణాలు నిలబడిపోయాడు రాజారావు.

అంతరంగంలో అపరాధభారం దాచుకున్న వాళ్ళకు అంత స్వచ్ఛంగా నవ్వటం సాధ్యపడుతుందా?

అవివాహితగా మాతృమూర్తి అయ్యే దురదృష్టం పాలయిన వ్యక్తులు ఇంత ఉల్లాసంగా ఉండగలరా?

ఏవిటీ అనిత?

తననే చూస్తున్న రాజారావు చూపులతో కలుసుకున్నాయి అనిత చూపులు.

హుషారుగా రాజారావు దగ్గిరికి వచ్చి "ఏం బావా! నువ్వూ చల్లగాలికి వచ్చావా?" అంది.

"కాదు. చెంపదెబ్బ కొట్టాలని వచ్చాను."

"కొట్టు!"

తన చెక్కిలి అందించింది.

పాలమీగడలా నున్నగా మెరిసిపోయే ఆ చెక్కిలిమీదనుంచి ప్రయత్నపూర్వకంగా చూపులు తిప్పుకున్నాడు రాజారావు.

"కన్ననూ, కమలనూ ట్యూషన్ మాన్పించి పార్కుకి తీసుకొచ్చావా? మా ఇంటి వ్యవహారాల్లో కలిగించుకునే అధికారం నీ కెవరిచ్చారు?"

"ఎవరూ ఇవ్వలేదు బావా! అదే వచ్చేసింది."

"బొత్తిగా సిగ్గులేదు."

"నీముందు సిగ్గు పడాలనే ఉంటుంది. కానీ పబ్లిక్ పార్కులో, చిన్న పిల్లలముందు...."

రాజారావు ముఖం ఎఱ్ఱబడింది.

కోపంగా "కన్నా!-కమలా!...." అని గర్జించాడు.

ఇద్దరూ వణికిపోతూ వచ్చి నిల్చున్నారు.

వాళ్ళ వెనకాతల రాణికూడా వచ్చింది.

"ముందు ఇంటికి పదండి. తరువాత మీ పని చెప్తాను...."

"ఆ మాస్టారు మంచివాడు కాడు మావయ్యా! కొడతారుట! కన్న, కమల నాతోనే చదువుకుంటారు——"

కన్న, కమల, గడగడ వణికిపోతోంటే చిరునవ్వుతో అంది రాణి.

"నేను నీకు మావయ్యని కాను."

కసిరాడు రాజారావు.

"మరి, ఎవరు నువ్వు?"

రాజారావు సమాధానం చెప్పకుండా నవ్వు నాపుకొంటూన్న అనితను ఎఱ్ఱగా చూసి "పదండి!" అన్నాడు గర్జిస్తున్నట్లు.

కమల క్రింద పడిపోయింది.

అనిత చటుక్కున వచ్చి కమల తల తన వళ్ళో పెట్టుకుని ముఖం తుడవసాగింది.

"చూడు! భయంతో ఎలా అయిపోయిందో? పసిపిల్లల మీదనా నీ ప్రతాపం? చిన్నపిల్లలు సహజంగా చాలా మంచివాళ్ళు. వాళ్ళని పాడు చేసేది పెద్దవాళ్ళు. మంచి మాటలతో పసిపిల్లలు మనమాటలు ఏదైనా సరే, వినేలాగ చేసుకోవచ్చు. తిట్టి కొట్టి నిష్కారణంగా వాళ్ళ మనసులు జబ్బుపడేలా చేస్తున్నాం. మనం మానసికంగా వాళ్ళకి దూరమవుతున్నాం!"

చిరాకుగా రాజారావును చూస్తూ అంది అనిత. కమల భయంతో క్రిందపడిపోయేవరకూ తను కమల నంతగా భయపెడుతున్నానని రాజారావుకు తెలియలేదు. తీరా కమల పడిపోయాక జాలితో పశ్చాత్తాపంతో అతని మనసు నిండిపోయింది.

రాజారావు ముందుకు వంగి "కమలా?" అని కమల చెయ్యి పట్టుకున్నాడు.

"చదువు కుంటాను. చదువు కుంటాను. అన్నయ్యా! కొట్టకు," అంది కమల వణికిపోతూ.

"నువ్వు నిజంగా కొడతావనుకుని భయపడిపోయింది. నువ్వెళ్ళు. వీళ్ళిద్దరినీ నేను ఇంటికి తీసుకొస్తాను."

దెబ్బతిన్నట్లు చూసాడు రాజారావు.

"వీళ్ళ క్షేమం కోరే——వీళ్ళు చదువుకొని వృద్ధిలోకి రావాలనే అంత కఠినంగా ఆజ్ఞాపించాను."

"నాకు తెలుసు."

చిన్న వయసులోనే శక్తికి మించిన బాధ్యతలను మోస్తూ తన తండ్రి నడి సముద్రంలో వదిలేసిన ఆ కుటుంబాన్ని ఒడ్డుకు చేర్చాలని ప్రయాసపడుతున్న ఆ యువకుణ్ణి ఆదరంగా చూస్తూ అంది అనిత.

ఆ చూపులతో కొన్ని క్షణాలు రాజారావు చూపులు చిక్కుకు పోయాయి.

అలిసిపోయిన అతని శరీరానికీ, మనసుకూ ఆ చల్లని చూపులలో ఏదో చల్లని ఊరట లభించినట్లయింది.

## 11

త్రమ అప్పుల సంగతి సమాజానికి తెలియకూడదనీ, అప్పుల బారీ నుండి ఆస్తిని రక్షించాలనీ రాజారావు పట్టుదల.

ఆ పట్టుదల నెగ్గించుకోవడానికి వీల్లేని విషమ పరిస్థితి వచ్చి పడింది.

లక్ష్మీపతిగారు ఇంటిని సహితం తాకట్టు పెట్టారు. ఆ సంగతి మొన్నటివరకు రాజారావుకు తెలియలేదు.

ఆ రోజే బాకీదారు వచ్చి తనకు పైకం చాలా అవసరమనీ, బాకీ జమ కట్టకపోతే, ఇల్లు వేలం వెయ్యవలసి వస్తుందనీ బెదిరించాడు.

రాజారావు మస్తిష్కం పగిలి పోసాగింది. ఎంత ఆలోచించినా డబ్బు దొరికే ఉపాయం కనిపించలేదు.

రాజారావు మంచి చిత్రకారుడు. లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నదే కాక, మంచి బొమ్మలు గీసి అమ్మి డబ్బు సంపాదించటానికి ప్రయత్నిస్తున్నాడు. తన పేరు బయటకు రాకుండా 'రాజా' అనే పేరుతో తన చిత్రాలు రహస్యంగా అమ్మిస్తున్నాడు.

ఎంత సంపాదించినా ఏ మూలకి?

పెద్ద కుటుంబం! బాగా బ్రతికిన కుటుంబం! కుటుంబం గడవాలి. అప్పులు తీరాలి.

ఇలాంటి ఆపద ముంచుకొస్తుందని ఊహించక పోవటంచేత ఏ కాస్త మిగిలినా ఎప్పటి కప్పుడు తీర్చేస్తున్నాడు.

ఎంతో కొంత ముట్ట చెపుతూ ఉండటంవలన, యిస్తాడన్న నమ్మకం ఉండటంవల్లా అప్పుల వాళ్లు కూడా వత్తిడి చెయ్యటం లేదు.

ఇప్పు డొక్కసారిగా యాభై వేలు ఎక్కడ దొరుకుతాయి? ఎలా పుట్టించగలడు?

అశాంతితో నిద్రరాక స్టాండ్ దగ్గరకి నడిచి అప్రయత్నంగా బొమ్మ గీయటం మొదలు పెట్టాడు. తనకు తెలియకుండానే అందులో లీనమయిపోయాడు.

బొమ్మ పూర్తయ్యేసరికి రాత్రి రెండు దాటింది.

చేతిలో కుంచె అక్కడే పడేసి అలసటగా అక్కడే చాప మీద పడుకున్నాడు.

కళ్ళు భగ్గున మండుతున్నాయి కాని, నిద్ర రాలేదు.

అడుగుల చప్పుడు వినిపించి ఆశ్చర్యంగా చూసాడు. అనిత వస్తోంది.

చటుక్కున కళ్లు మూసుకున్నాడు.



అనిత స్టాండ్ దగ్గిరకు వచ్చి బొమ్మను తదేకంగా కొంతసేపు చూసింది. ఆ తరువాత చాపమీద పడుకున్న రాజారావును చూసింది· అక్కడనుండి వెళ్ళిపోయింది.

అనిత ఎందుకు వచ్చినట్లా అని రాజారావు మధన పడుతూండగానే చేతిలో దిండూ, దుప్పటీ తీసుకుని అనిత మళ్ళీ వచ్చింది.

దిండు జాగ్రత్తగా రాజారావు తలక్రింద పెట్టి దుప్పటి కప్పి వెళ్ళిపోయింది.

రాజారావు ఆశ్చర్యానికి మేరలేదు. అనిత తన నింత కనిపెట్టి చూస్తోందా?

తను ఇంతవరకు నిద్రపోలేదనీ, బొమ్మ గీసుకుంటున్నాడనీ అనితకెలా తెలిసిందీ?

అనితకు తన మీద ప్రేమ ఉందా?

మరి రాణి..........?

అశాంతితో దొర్లి దుప్పటి తీసి పారేసి లోపలి కొచ్చి చూసాడు.

అనిత ప్రశాంతంగా నిద్రపోతోంది. కన్న, కమల అనిత చెరో వైపు పడుకున్నారు. రాణి ఎక్కడ పడుకుందో అర్థం కాలేదు.

ఒక్క క్షణం నిలబడి వచ్చేసాడు.

తూరుపు తెల్లవారి లోకమంతా కళకళ లాడింది. కానీ రాజారావు మనసు మాత్రం కలవరపడుతోంది.

అతని చిత్రాలు అమ్మి పెట్టే గోపాల్‌కు రాత్రి గీసిన బొమ్మ ఇచ్చి "ఎంత వస్తే అంతకు ఇచ్చెయ్యి-" అన్నాడు—

చిత్రాలు చూసి ఆనందించే వాళ్ళే తక్కువ. కొనే వాళ్ళు మరీ తక్కువ.

ఒక్క నీటి బొట్టుతో మహా సముద్రం పూడుతుందా? ఈ చిత్రాని కొచ్చిన డబ్బుతో తన అవసరాలలో నూరో వంతైనా తీరవు.

సాయంత్రం నాలుగు గంటలకు వెలిగిపోతున్న ముఖంతో వచ్చాడు గోపాల్.

"సార్! సార్! మన చిత్రాన్ని యాభై వేలకు కొన్నారు. యాభై వేలు!"

ఉలికి పడ్డాడు రాజారావు.

యాభై వేలు! సరిగా ప్రస్తుతం తనకు కావలిసిన మొత్తం!

సంభ్రమంతో గోపాల్ భుజాలు పట్టుకుని ఊపుతూ "నిజమా! గోపాల్! నిజమా!" అన్నాడు.

"అవునుసార్! ఇదిగో! చెక్ కూడా కాదు. కేష్!"

గోపాల్ చేతిలో డబ్బు చూసాక కూడా నమ్మలేక పోయాడు రాజారావు.

"ఎవరు కొన్నారు?"

"ఎవరో ప్రకాశరావుగారట!"

"ఎక్కడుంటున్నారో, ఏం చేస్తున్నారో అడిగావా?"

"వారు కూడా లాయరే నండీ! ఈ ఊరు కాదుట! నిన్ననే వచ్చారుట! రేపు వెళ్ళిపోతారుట!"

"ఎక్కడుంటున్నారో అడిగావా?"

"ఆ! హోటల్ నందనలో...."

"వెళ్దాం పద! వెళ్ళి మన కృతజ్ఞతలు చెప్పుకుందాం!"

రాజారావు, గోపాల్, వెళ్ళేసరికి ప్రకాశరావు ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు.

సాటి లాయర్‌గా రాజారావును సగౌరవంగా ఆహ్వానించాడు.

"మీకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఇంతగా కళను గౌరవించి ప్రోత్సహించే వ్యక్తులను ఎక్కడా చూడలేదు."

గౌరవమూ, ఆనందమూ ఉట్టి పడుతుండగా అన్నాడు రాజారావు.

"ఆగండి! ఆగండి! మీ పొగడ్తలూ నాకు దక్కవు, మీ కృతజ్ఞతలూ నాకు దక్కవు. నేను కేవలం నా క్లయింట్ ఆదేశానుసారం ఆ బొమ్మ కొన్నాను. ఆ మాట కొస్తే అంత డబ్బు ఆ బొమ్మ మీద వృథా చెయ్యవద్దని నచ్చజెప్పాను కూడా! ఏమిటో ఆ అమ్మాయి ఏనాడు పట్టిన పట్టు వదిలే రకం కాదు."

"అమ్మాయా? ఎవరా అమ్మాయి?"

"మిస్ అనిత! దయాశంకర్‌గారి అమ్మాయి."

రాజారావు నిలువెల్లా వణికాడు. అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"దయాశంకర్‌గారికి తెలుసా ఈ సంగతి?"

"ఈ డబ్బు మిస్ అనిత తల్లిగారిది. ఈ డబ్బు కేవలం అనిత కుటుంబానికే చెందాలని ఆవిడ విల్లు రాసింది."

"మరి, ఇప్పుడెలా ఖర్చుపెట్ట గలిగారు?"

"సారీ! నా క్లయింట్ గురించిన వివరాలు నేను పరాయివ్యక్తికి చెప్పలేను. ఇప్పటికే అవసరాన్ని మించి మాట్లాడాను."

'పరాయివ్యక్తి' అన్న పదం విచిత్రంగా రాజారావు మనసును గుచ్చింది. అయినా తనకూ అనితకూ గల సంబంధం ప్రకాశరావుకు తెలియదన్న సంగతి అతనికొక తృప్తి నిచ్చింది.

"థేంక్స్! ఒక చిన్న మనవి."

"ఏమిటీ?"

"మీ డబ్బు మీ కిచ్చేస్తాను. నా బొమ్మ నా కిచ్చెయ్యండి."

"సార్! సార్!"

గోపాల్ ఆతురతతో వారించబోయి రాజారావు "హుష్"తో తగ్గిపోయాడు.

"అయామ్ సారీ! ఆ బొమ్మ నా దగ్గిరలేదు. మిస్. అనిత తీసికెళ్ళి పోయారు."

"థేంక్స్."

రాజారావు ఇంటికి వచ్చేసరికి అనిత కమలకు జడలు వేస్తోంది. గుమ్మంలో నిలబడి తనను తదేకంగా చూస్తోన్న రాజారావును చిరునవ్వుతో చూసి "నిలబడి చూడకండి. కాళ్ళు నెప్పులు పుడతాయి." అంది అల్లరిగా.

"నన్ను అవమానించి తీరాలని నువ్వింతగా ఎందుకు కంకణం కట్టుకున్నావో అర్థం కావటం లేదు."

ఆ మాటలూ ఆ మాటలు పలికినప్పటి అతని కంఠంలోని కటుత్వమూ ముఖంలో గాంభీర్యమూ అనిత చిరునవ్వును ఎగిరి పోయేలా చేసాయి.

"నేను ఎవరినీ అవమానించను. నన్ను అవమానిస్తే మాత్రం ప్రతీకారం తీర్చుకుంటాను."

"నిన్నేవిధంగా అవమానించాను?"

"నేను నిన్నెలా అవమానించాను?"

"ప్రస్తుతం నేను ఇబ్బందుల్లో ఉండి ఉండవచ్చు. కానీ, ముష్టివాణ్ని కాను. యాభై వేలు నాకు దానంచేసి ఆ బొమ్మ కొన్నట్లు నటించక్కర్లేదు."

"పెళ్ళికాకుండా పిల్ల తల్లినయితే కావచ్చు. నేను బజారు మనిషిని కాను. చిత్రకళ వంకతో చెక్కిలి అందిస్తున్నట్లుగా నా బొమ్మ గీయక్కర్లేదు."

"నేను నీ బొమ్మ గీసానా?"

"లేకపోతే నాకు డబ్బు ఎక్కువుందా? నీ పిచ్చిగీతలు కొనేందుకు?"

"తీసుకురా!"

"చూడు!"

కమల జడకి రిబ్బన్ ముడివేసి తన సూట్‌కేస్‌లో దాచిన చిత్రపటం తెచ్చి తన చేతిలో పట్టుకుని చూపించింది.

అచ్చు గుద్దినట్లు అనితలాగే ఉంది ఆ చిత్రపటం. మెడ ఒక ప్రక్కకు వాల్చి చిలిపినవ్వుతో చెక్కిలి అందిస్తున్నట్లుగా ఉంది.

కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయిన రాజారావు గభాలున ఆ చిత్రపటం లాక్కోబోయాడు.

అలాంటిది ముందే ఊహించిన దానిలా అనిత మెరుపులా వెనక్కు తగ్గి చిత్రపటాన్ని పైటచాటున దాచుకుని "ఈ బొమ్మ లాగి పారెయ్యటం తేలిక. నీ మనసులోని నా బొమ్మను తుడిచెయ్యగలవా? అప్పుడు నాముందు నిలిచి ఈ బొమ్మ అడుగు," అని వెక్కిరిస్తున్నట్లు నవ్వి పారిపోయింది.

## 12

కన్న, కమల తెచ్చిన ప్రోగ్రెస్ రిపోర్టులు చూసి ఆశ్చర్యపోయాడు రాజారావు. ఇదివరలో వాళ్ళకు ప్రతిదానిలోనూ ఇరవై ముప్పై మార్కులకంటె ఎక్కువ వచ్చేవి కావు.

అలాంటిది ఇంచుమించు అన్ని సబ్జక్టులలోనూ యాభై పైగా మార్కులు వచ్చాయి. చాలా సంతోషించాడు రాజారావు. వెంటనే ట్యూషన్‌మాస్టారి దగ్గిరకెళ్ళి "మాస్టారూ, మీ ఋణం తీర్చుకోలేను. మా కన్న, కమల, ఇద్దరూ చాలా బాగా మార్కులు తెచ్చుకున్నారు," అన్నాడు.

మాస్టారిముఖం వికసించటానికి మారు వడిలిపోయింది.

"నన్ను పొగడకు బాబూ! సిగ్గేస్తోంది." అన్నాడు.

"అదేం మాస్టారూ!"

"ఈ నెలంతా వాళ్ళకు నేను పాఠాలు చెప్పలేదు. ఏ రోజు కారోజు మీ అనితమ్మ వాళ్ళను పార్కులోకో తోటలోకో తీసుకుపోతోంది. నా జీతం రాళ్ళుపోతాయని నేనూ మీ కేమీ చెప్పలేదు. ఎంతైనా గురువుని. అన్యాయంగా మీ దగ్గిర్నుండి డబ్బు తీసుకోలేను."

రాజారావు ఆశ్చర్యానికి అంతులేదు.

అనితను నిందించాలా? పిల్లల చదువులో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందే!

లోపలికి వచ్చేసరికి కనిపించిన దృశ్యం అతడిని మరింత ఆశ్చర్యంలో ముంచింది.

అనిత సుశీలకు జాకెట్టు కత్తిరించి కుట్టడం నేర్పిస్తోంది.

ఈ అల్లరి గారాలపిల్లకు కుట్టుకూడా చేతనవునా?

ఆంగ్లో ఇండియన్ తల్లికి పుట్టి ఉత్తర ప్రాంతంలో పెరిగిన ఈ యువతి ఎంత తేలికగా ఈ ఇంటిలో కలిసిపోయింది?

కన్న, కమల, తమ పుస్తకాల ముందు కూచుని వాళ్ళే చదువుకుంటున్నారు.

ఇదివరకెన్నడూ అలా చదివేవారు కారు.

సంతృప్తితో మనసు నిండిపోగా అక్కడి కుర్చీలో కూచుని "కుట్టుపని ఎక్కడ నేర్చుకున్నావు అనితా!" అన్నాడు.

"మా అమ్మ దగ్గిర...."

తల వంచుకుని సమాధానం చెప్పింది అనిత.




అనిత తల్లి ప్రస్తావన వచ్చేసరికి రాజారావు మనసులో ప్రసన్నత కొంతవరకు తగ్గింది.

"పియానో వాయించటం, కుట్టటం, అల్లటం, నాట్యంచెయ్యటం, వంట అన్నీ అమ్మదగ్గిరే నేర్చుకున్నాను. అయితే నా కొచ్చినవన్నీ ఉత్తరాది వంటలు. ఇక్కడి వంటలు అత్తయ్యదగ్గిర నేర్చుకుంటున్నాను."

"నేర్చుకుంటున్నాననే వంకతో వంటంతా నువ్వే చేస్తున్నావు."

నిష్ఠూరం వేస్తున్నట్లు అంది సుశీల.

"ఏం చెయ్యమంటావ్? నాకు ఎప్పుడూ చేతినిండా పని ఉండాలి. ఇవేవీ లేకపోతే దెబ్బలాడటానికి ఉజ్జీ అయినా దొరకాలి."

రాజారావును చూసి నవ్వింది అనిత.

ఆ రోజు అనిత మాటలు వింటున్నకొద్దీ, అనితను చూస్తున్నకొద్దీ, ఏదో ఆర్ద్రభావం కలుగసాగింది రాజారావులో....

"నా లైబ్రరీలో చాలా పుస్తకాలున్నాయి. చదువుకో!"

ఆశ్చర్యంగా చూసింది సుశీల.

రాజారావు అపురూపంగా ఎంచుకునే కొన్నింటిలో ఒకటి. ఎంతటి ఆత్మీయులకూ ఆ లైబ్రరీని అప్పగించడు రాజారావు.

సుశీల చూపులలో ఆశ్చర్యాన్ని గమనించి లోలోపల లజ్జ పడ్డాడు. సంభాషణ మారుస్తూ "కన్నా! కమలా! మీకు చాలా మంచి మార్కులు వచ్చాయి. ఏం కావాలో అడగండి. కొనిపెడతాను," అన్నాడు.

పిల్లలిద్దరూ పొంగిపోయారు.

ఉత్సాహంతో ఇద్దరూ ఒక్కసారి అన్న దగ్గిర కొచ్చారు.

"మాకు రంగురంగుల కార్డుబోర్డు తెచ్చిపెట్టు." అన్నారు.

వాళ్ళు బంతికాని, రింగ్‌కాని కోరుకుంటారనుకున్న రాజారావు ఆశ్చర్యపోతూ. "కార్డుబోర్డు దేనికి?" అన్నాడు.

"రకరకాల బొమ్మలు తయారు చేసుకుంటాం?"

"మీ కెవరు నేర్పుతారు?"

"అనిత వదిన!"

రాజారావు ఒకసారి అనితను వోరగా చూసి "మీకీ మధ్య చదువెవరు చెప్తున్నారు?" అన్నాడు సమాధానం తనకు తెలుస్తోన్నా....

అనిత కలిగించుకుంది.

"ఎవ్వరూ చెప్పటంలేదు. వాళ్ళే చదువుకుంటున్నారు. సాయంత్రాలు ఆడుకునే సమయం. ఆ సమయంలో ఆడనిచ్చి తరువాత చదువుకోమంటే వాళ్ళేచదువు కుంటారు. తెలియనిది నేను చెపుతున్నాను. ఆ మాస్టార్ దగ్గిర భయంతో వచ్చినవి కూడా మరిచిపోయేవారు. ఇక్కడ ఎవరి భయమూ లేదు గనుక చదివిన దేదో తలకెక్కించుకుంటున్నారు. అంతే!"

"మీ ఋణం ఎలా తీర్చుకోవాలో నా కర్థం కావటంలేదు!"

"పెళ్ళి కాకముందే పిల్ల తల్లి నయ్యానని నన్ను ఎవ్వరూ పెళ్ళి చేసుకోవటం లేదు. పోనీ, నన్ను పెళ్లాడేసి ఋణం తీర్చుకోండి," చిలిపినవ్వుతో కొంటె చూపులతో అంది.

రాజారావు ప్రసన్నత పటాపంచలయి నిలువెల్లా భగ్గు మన్నాడు.

"ఛీ! ఛీ! నీ కసలు సంస్కారమూ, సభ్యతా తెలియవు."

"నిజంగానే ఈనాటి మన సంస్కారం ఎలాంటిదో నా కర్థం కావటం లేదు. అది తెలుసుకుందామనే వచ్చాను...."

అనిత మాటల్లో ఏదో వ్యంగ్యం ధ్వనించి సూటిగా అనిత ముఖంలోకి చూసాడు.

అనిత ముఖం మీది హేళనతో కూడిన చిరునవ్వు రాజారావును మండించింది.

"'మన' అని కలిపి మాట్లాడకు. మీ సంస్కారమూ, మా సంస్కారమూ ఏనాటికీ ఒకటి కావు." అన్నాడు కసిగా....

పకపక నవ్వుతూ "నూటికి నూరు పాళ్ళు నిజం!" అంది అనిత.

కాలితో నేలను గట్టిగా తన్ని విసురుగా వెళ్ళిపోయాడు రాజారావు.

## 13

రమణరావు తమ ఇంటికి రాగానే సుశీలా రమణరావులకు ఏకాంతం కలిగించడం కోసం రాజారావు ఏదో వంకన బయటికి వెళ్ళటం పరిపాటి. ఇటీవల రాజారావు అలా వెళ్ళగానే రమణరావు వెళ్ళిపోతున్నాడు. సుశీల ఒక్కర్తే ఏదో చదువు కుంటోంది.

ఎప్పటి లాగానే "రమణరావుగారు వెళ్ళిపోయారా?" అని అడిగాడు వచ్చీ రాగానే రాజారావు.

"నువ్వలా వెళ్ళగానే ఆయ నిలా వెళ్ళిపోయారు." చిరునవ్వుతో చెప్పింది సుశీల.

ఆ వెంటనే అనిత, సుశీల ఒకరి నొకరు ఓరగా చూసుకుని నవ్వుకున్నారు. ఆ నవ్వులు చూసిన రాజారావుకు ఏదో అనుమానం తోచింది.

"సుశీలా! ఏం జరిగింది? నిజం చెప్పు! రమణరావుగారు ఎందుకు వెళ్ళిపోయారు?" అన్నాడు కోపంగా—

సుశీల కంగారు పడింది.

బెంబేలుగా "నిజం! నాకేమీ తెలియదు. కొంచెం సేపు ఉండమని నేను బ్రతిమాలాను కూడా...." అంది.

"ఆ మాట నిజం పాపం, చాలా బ్రతిమాలింది. కావాలంటే ఆయననే అడుగు."

కొంటెగా అంది అనిత.

"నువ్వూ అక్కడే ఉన్నావా?"

అసహనంగా అడిగాడు రాజారావు.

"రామ! రామ! నేను అత్తయ్య దగ్గిర కూర్చుని కబుర్లు చెపుతున్నాను. కావాలంటే అత్తయ్య నడుగు. రమణరావుగారు వెళ్తోంటే సుశీల వెనకే వెళ్ళి కొంచెంసేపు వుండమని అడుగుతోంది. నాకు వినిపించింది."

"ఇదేదో తేలుస్తాను."

"త్వరగా తేల్చాలనే నా తాపత్రయమూ...."

రాజారావు వెంటనే లేచి రమణరావు దగ్గిరకి వెళ్ళాడు.

రమణరావు విపరీతమయిన అశాంతితో బాధపడుతున్నట్లు ముఖం చూడగానే తెలిసిపోతుంది ఎవరికైనా....

"రమణరావుగారూ! నేను వచ్చేవరకు ఉండకుండా వచ్చేసారేం?"

"నాకు పనుంది. అంటే ఇప్పుడు కాదు. కానీ, ఇప్పుడు కూడా ఉంది. కొంచెం చూసుకోవాలి. అదీ...."

రమణరావు విపరీతంగా కంగారు పడుతున్నాడని అర్థమయింది రాజారావుకి....

తన దగ్గిర నిజం దాస్తున్నాడని కూడా అర్థమయింది.

"రమణరావుగారూ! స్థిమితంగా కూర్చోండి. ఏం జరిగిందో చెప్పండి. నా దగ్గిర కంగారు దేనికి? మా ఇంట్లో మీ కెవరైనా ఇబ్బంది కలిగించారా?"

రమణరావు నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నవాడిలా కళ్ళు రెండూ గట్టిగా మూసుకుని ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా కళ్ళు తెరిచాడు.

"రాజారావుగారూ! మీకు నాతో సంబంధం కలుపుకోవటం మనసారా ఇష్టమేనా?"

"ఇంచుమించు అంతా నిశ్చయమయిపోయిన తర్వాత ఇవేం మాటలండీ!"

రమణరావు హృదయం కుదుటబడింది. రాజారావు కేమీ తెలియదని తెలిసింది.

సుశీలకు తెలుసో? తెలియదో?

"అయితే, నాదొక్క కోరిక!"

"ఏమిటో చెప్పండి!"

"ఆ జానకిని మీ ఇంటికి రానీయకండి——"

ఉలిక్కిపడ్డాడు రాజారావు.

"దానికీ, దీనికీ ఏం సంబంధం?"

"చూడండి! మనమంతా పరువు ప్రతిష్టలతో బ్రతుకుతున్న వాళ్ళం. అల్లరిపాలయిన ఆ పిల్ల మన ఇళ్ళకు రావటం ఏం బాగుంటుందీ?"

రాజారావు చటుక్కున సమాధానం చెప్పలేకపోయాడు. జానకిపట్ల మొదటినుంచీ అతని మనసులో ఏదో ఆర్ద్రభావముంది. అదీగాక జానకి తనంత తను డబ్బుకోసం ఎవడినో వలలో వేసుకోబోయి అతడు డబ్బియ్యకపోగా పోలీసులను పిలిచి అల్లరిపెట్ట జూచిందనే కట్టుకథ అతనేనాడూ నమ్మలేదు.

అతని కోపమంతా ఊరికి దూరంగా ఉన్న పార్కులోకి ఆడపిల్ల ఒంటరిగా ఎందుకు వెళ్ళాలనేదే!

ఏది ఏమయినా జానకి అల్లరిపాలయింది. బ్రతుకు బండలయింది.

ఇప్పుడు తనేం చెయ్యగలడు?

"దురదృష్టవశాన అల్లరి పాలయింది కానీ, మన ఇళ్ళకు రాకూడనంతటి దుర్మార్గురాలు కాదండీ జానకి! ఏ పాపిష్టి వెధవ దాని జీవితంలో నిప్పులు పోశాడో కాని వాడు దాని ఫలితం అనుభవించక తప్పదు."

రమణరావు ముఖం పాలి పోయింది. గ్రుక్కిళ్ళు మింగుతూ "అంతే! అంతే! కానీ, జానకి మీ యింటి కొస్తున్నంతవరకూ నేను మీ ఇంటికిరాను. ఆ తరువాత మీ ఇష్టం." అన్నాడు.

"చిన్నతనం నుండీ జానకి మా ఇంట్లో పిల్లలాగ తిరిగింది. నాకు తెలిసినంత వరకు దానిది చాలా సాధు స్వభావం. ఈ అల్లరయ్యాక సిగ్గుతో చితికిపోతూ వీధి ముఖం కూడా చూడటం లేదు. నా నోటితో నేను కఠినంగా రావద్దని ఎలా చెప్పను?"


"నా నిర్ణయం చెప్పాను. మీరు ఆలోచించుకోండి. నా సంబంధం మీకు కావాలనుకొంటే ఆ జానకిని దూరంగా ఉంచండి."

గంభీరంగా కటువుగా అన్నాడు రమణరావు. ఆ కటుత్వానికి రాజారావు మనసు చివుక్కుమన్నా "సరే!" అని లేచాడు.

## 14

ప్రసితనం నుండీ రాజారావు కుటుంబానికీ తులశమ్మ కుటుంబానికీ చాలా సన్నిహిత సంబధం ఉన్నా, ఏనాడూ రాజారావు తులశమ్మ ఇంటికి రాలేదు.

తలవని తలంపుగా తన కళ్ళముందు రాజారావును చూడగానే, సంతోషంతో, సంభ్రమంతో, ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరయింది జానకి.




"రా! అన్నయ్యా! కూచో!"

ప్రేమగా కుర్చీ చూపించింది.

తనను చూడగానే పట్టరాని ఆనందం ప్రతిఫలిస్తోన్న ఆ ముఖంలోకి చూడలేక పోయాడు రాజారావు.

మనిషి బాగా చిక్కిపోయింది. ఒక్క అలంకారమయినా లేదు బొట్టూ, కాటుకా తప్ప. నేతచీర కట్టుకుంది.

ఈ వ్యక్తిపైనా అలాంటి కట్టు కథలు!

అంత అల్లరి!

జానకి ప్లేటులో మినపసున్ని జంతికలు తెచ్చిపెట్టింది. అవి చూశాక తమ ఇంట్లోకి ఆ తినుబండారా లెలా వచ్చాయో అర్థమయింది రాజారావుకి.

జానకి చూపుతున్న ఆదరణముందు తను చెప్పదలచుకున్నది ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు రాజారావుకి.

జానకే మాట్లాడింది.

"అలా వున్నావేం అన్నయ్యా! వంట్లో బాగుండలేదా?"

"బాగానే ఉందమ్మా!"

"ఇవాళ నామనసుకి చాలాచాలాసంతోషంగాఉందన్నయ్యా!నాజీవితం ఇలా భగ్నమయ్యాక ఇంత ఆనందం నా కెన్నడూ కలగలేదు. నువ్వు నన్ను నోరువిప్పి ఏమీ అనకపోయినా ఈ అపవాదుల పాలయ్యాక నీ ముందు నిలబడలేక పోయేదానిని. తరువాత సుశీల చెప్పింది. నాతో సుశీలను మాట్లాడద్దన్నావుట కదూ! ఎంత కృంగిపోయాననుకున్నావు అన్నయ్యా! సంఘమంతా ఒక్కటై లేని నిందలు నా నెత్తిన వేసిన నాడు కూడా అంత బాధపడలేదు. బ్రతుకుమీదే విరక్తిపుట్టింది. నువ్వు కూడా నన్ను అసహ్యించుకోవటం కంటే నాకు వేరే మరణం అక్కర్లేదు. ఇవాళ నువ్వు నా దగ్గిరకొచ్చావు. అంటే నా మీద కోపం పోయినట్లేగా! నాకు గట్టి నమ్మకం. నన్ను గురించి నువ్వు చెడుగా అనుకోలేవని........"

ఆ అమాయకురాలి మాటలు వింటోంటే, ఆ వడిలిన ముఖం చూస్తోంటే రాజారావు కళ్ళు చెమ్మగిల్లాయి. "నాకు నీ మీద ఏనాడూ కోపంలేదమ్మా! జాలితప్ప. కాని........"

జానకి తల దించుకుని "నాకు తెలుసు అన్నయ్యా!" అంది.

తిరిగి అంది:

"పోనీయ్ అన్నయ్యా! ఇన్నాళ్ళకైనా నామీద నీకు దయ కలిగింది. మిగిలిన సంఘమంతా నా ముఖంమీద ఉమ్మివేసినా నాకు బాధలేదు. నువ్వూ, సుశీల, కన్న, కమల, అమ్మగారూ, మీ అందరితో కలిసి మెలిసి ఉండగలిగితే అది చాలు."

రాజారావు గొంతు పూడిపోతోంది. ప్రయత్నించీ తను చెప్పదలచు కున్నది చెప్పలేక పోతున్నాడు.

"మీ అమ్మ ఏది జానకీ?"

"ఇవాళ అమ్మగారికి గుండెల్లో నొప్పి వచ్చింది. మన ఇంటికే వంట చెయ్యడానికి వెళ్ళింది. నువ్వు మన యింటి నుంచి రావటం లేదా?"

రాజారావు మనసు వేదనతో మెలికలు తిరిగిపోసాగింది.

"రమణరావు గారింటి నుండి వచ్చాను."

తను చెప్పదలచుకున్నది చెప్పక తప్పదన్నట్లు నాంది మొదలు పెట్టాడు.

ఆ పేరు వింటోనే జానకి అదిరిపడింది. పాలిపోయిన ముఖంతో వణుకుతున్న పెదవులను నొక్కిపట్టుతూ కూర్చుంది.

తను వచ్చిన పని ఎంత కష్టమో అర్థంకాసాగింది రాజారావుకు. గొంతు సవరించుకున్నాడు.

"అమ్మా! జానకీ! నే నెలాంటి నడిసముద్రంలో ఉన్నానో నీకు పూర్తిగా తెలియదు. కొంత కొంత అప్పులు తీర్చాను. కానీ ఇంకా తీర్చవలసినవి చాలా ఉన్నాయి. అన్నింటిలో అనిత కియ్యవలసిన యాభై వేల అప్పు నన్ను పుండులా సలుపుతోంది."

"అనిత కియ్యాలా?"

"ఎలాగో మన యిల్లు వేలం వెయ్యబోతున్నారని తెలుసుకుని, ఆ బాకీకి కావలిసిన యాభై వేలు బొమ్మకొంటున్న మిషమీద నా కిచ్చింది. గత్యంతరంలేక ఆ డబ్బుతో బాకీ తీర్చాను. కానీ ఆడపిల్ల సొమ్ముతో పబ్బం గడుపుకున్నాననే వ్యథ నన్ను వదలటంలేదు. ఆ అప్పు తీర్చే వరకూ నాకు శాంతిలేదు..........ఇలాటి పరిస్థితుల్లో ఆ రమణరావు సంబంధం తప్పిపోతే సుశీల పెళ్ళెలా చెయ్యగలను?"

జానకిముఖంలో జీవం నశించింది. తలుపును గట్టిగా పట్టుకుని "సుశీలను రమణరావుకు యియ్యటానికే నిశ్చయించుకున్నావా, అన్నయ్యా! సుశీలను అడిగావా?" అంది.

"సుశీల కేం తెలుసమ్మా! అది మరొకళ్ళను ప్రేమిస్తే నేను ఈ విషయంలో బలవంత పెట్టేవాడినికాను. అలాంటి అనుబంధమేదీ సుశీలకి లేనపుడు తనను చేసుకున్నవాడితో సర్దుకుపోగలదు. ప్రస్తుతం నేను తేగలిగిన వాటిల్లో యిదే మంచి సంబంధం!"

"ఒకవేళ సుశీలకు ఇష్టంలేకపోతే........"

"లేకపోతే, ఆ మాట నాతో ముందే చెప్పేదిగా! తాంబూలాలు పుచ్చుకోలేదు తప్ప అంతా నిశ్చయమయింది. నా స్నేహితులకీ బంధు వులకీ అందరికీ సుశీలను రమణరావు కియ్యబోతున్నట్లు చెప్పేశాను. ఈ సంబంధం మనం వదులుకుంటే సుశీల కింతలో పెళ్ళి కాదు. నాకు మనశ్శాంతి ఉండదు."

—జానకి సమాధానం చెప్పలేదు.

"ఆ రమణరావు ఏమన్నాడో తెలుసా జానకీ! నువ్వు మా ఇంటి కొస్తే తను మా యింటికి రాలేడట."

ఈ మాటలు విని జానకి బాధపడుతుందనుకున్న రాజారావు రాయిలా కూర్చున్న జానకిని చూసి ఆశ్చర్యపోయాడు.

తరువాత ఎంత ప్రయత్నించినా రాజారావు తను చెప్పదలచు కున్నది చెప్పలేక పోయాడు. గద్గదికతతో "నన్ను క్షమించమ్మా!" అన్నాడు. జానకి పేలవంగా నవ్వి "బెంగపెట్టుకోకు అన్నయ్యా! ఇంక మీదట నువ్వు రమ్మనేవరకూ ఎవరు పిలిచినా అక్కడికి రానులే!" అంది.

జానకి ముఖంలోకి చూడలేక త్వరత్వరగా అక్కడినుండి వచ్చేశాడు రాజారావు.

## 15

ఎప్పుడోకాని తన దగ్గిరకురాని తులశమ్మను సగౌరవంగా ఆహ్వానిస్తూ "రండి. కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?" అన్నాడు రాజారావు.

"తల్లి తర్వాత తల్లిలాంటి దానిని. నువ్వు నామాట వినాలి బాబూ!" అంది తులశమ్మ.

"చెప్పండి. తప్పకుండా వింటాను."

"జానకి చెప్పింది. నువ్వు అనితకు యాభై వేలియ్యాలిట కదూ."

"అవునమ్మా! ఆ బాకే యెలా తీరుతుందో అర్థం కావటం లేదు. అది తీర్చేవరకూ నాకు మనశ్శాంతి లేదు."

"అది సహజమే బాబూ! అయినా ఆడపిల్లకి ఉన్నంతలో మనం యిచ్చిపంపాలి కాని, తన సొమ్ము కాశపడతామా? ఇదిగో, ఈ డబ్బు అనిత కియ్యి."

తన కళ్ళముందు తులశమ్మ ఉంచిన నోట్ల కట్టలు చూసేసరికి తల తిరిగినట్లయింది రాజారావుకు.

"ఏవిటమ్మా, ఇది?"

"నా కున్నది కాస్తా అమ్మితే వచ్చిందిది."

"వద్దమ్మా. వద్దు. ఒక పరాయి వ్యక్తి నుండి యింత దానం నేను స్వీకరించలేను."

"నా మాట విను. నేను నీకు తల్లిలాంటిదానినే."

"తప్పకుండా తల్లిలాంటివారే! ఎప్పుడూ మిమ్మల్ని గౌరవిస్తాను. కానీ, ఈ సొమ్ము మాత్రం తీసుకోను."

"బాబూ!"

ప్రాధేయపూర్వకంగా అంది తులశమ్మ.

"నన్ను క్షమించండి. నా రెక్కలు చల్లగా ఉన్నంతవరకూ మరొకరి సొమ్ముకు నేను ఆశపడక్కర్లేదు."

"నా మాట వినవా?"

"వినలేను."

"ఇది పరాయి సొమ్ము కాదు."

రాజారావు నవ్వి "భలేగా అంటున్నారు" అన్నాడు.

"నిజమే చెప్తున్నాను. తప్పని సరయి నిన్ను ఇబ్బందులలో ఆదుకోవటం కోసం చెపుతున్నాను. ఇది మీ నాన్నగారి సొమ్ము. ఆయన కుటుంబాన్ని ఆదుకోవటంకంటె ఈ సొమ్ముకి సరిఅయిన వినియోగం లేదు."

రాజారావు తల గిఱ్ఱున తిరుగ సాగింది. మొదటినుండీ తులశమ్మ తమ కుటుంబంపట్ల చూపిస్తున్న వాత్సల్యమూ, జీతభత్యాలు లేకుండా తల్లికి అనారోగ్యంగా వున్నప్పుడల్లా వంట చేసి పెట్టడమూ, ఆవిడ, జానకి, చూపుతున్న నిర్వ్యాజమైన మమత అన్నీ ఒక్కసారిగా అర్థం కాసాగాయి.

ఈ తులశమ్మ తన తల్లికంటె ఏ విధంగా తక్కువది? సంఘంలో అప్రతిష్ట వచ్చినా తను ప్రేమించిన వ్యక్తి పరువు ప్రతిష్ఠల కోసం ఆ అపనిందలన్నీ సహించింది. తన సవతికీ, సవతి బిడ్డలకు నిండు మనసుతో సేవలు చేసింది.

చివరకు తన సర్వస్వమూ తెగ నమ్మి, తను ప్రేమించిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకుంటోంది.

సంఘంలో కులటగా ముద్ర వేయబడ్డ ఈ యువతి ఏ పతివ్రతలకు తీసిపోతుంది?

"సందేహించకు బాబూ! మొదటి నుంచీ లేమిలో వున్నదాన్ని. నా రెక్కల కష్టంతో నేను బ్రతకలేకపోను. భగవంతుడు మా బీదల కేదీ ఇవ్వకపోయినా, ఈ మిధ్య గౌరవపు బరువునుండి మాత్రం తప్పించాడు. ఏ ఇంట్లో వంట చేసుకున్నా నా తిండి గడిచిపోతుంది. బాగా బ్రతికిన వాడివి. ఈ ఇబ్బందులు ఒక్కసారిగా తట్టుకోలేవు. తీసుకో!"

ఈ మాటలకు రాజారావు మనసు కదిలిపోయింది.

"అమ్మా!" అన్నాడు ఆర్తిగా.

తులశమ్మ ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"మనసారా అలా పిలిచావు. అంత చాలు ఈ బ్రతుక్కి" అంది.

లేవబోతున్న తులశమ్మను చెయ్యి పట్టుకుని ఆపి "అమ్మా! ఇవాళ నుండి మీరూ జానకీ, ఇక్కడే, మా తోటే ఉండాలి." అన్నాడు.

"వద్దు బాబూ వద్దు. ఎంత అప్రతిష్ట ఎదుర్కోవలసివస్తుందో ఊహించటం లేదు. పెళ్ళి కావలసిన చెల్లెళ్ళున్నారు నీకు...."

"జానకి మాత్రం నా చెల్లెలు కాదు. మీరు నా తల్లి కాదా? మీ బాధ్యత స్వీకరించే స్థైర్యం నాకు లేనపుడు మీ సొమ్ము వాడుకునే అధికారమూ రాదు. ఇస్తే రెండూ ఇవ్వండి. లేకపోతే, రెండూ వద్దు."




రాజారావు పట్టుదల తెలిసిన తులశమ్మ బెంగగా "నిన్ను ఒక ఇబ్బంది నుండి పద్దెక్కించటానికి ప్రయత్నించి మరో క్రొత్త ఇబ్బందులు సృష్టించానా?" అంది.

"అమ్మా! ఇది ఇబ్బందిగా నేను భావించటం లేదు. ఈ నాటికైనా నావారిని గుర్తించి మాలో కలుపుకో గలిగినందుకు సంతోషిస్తున్నాను."

రాజారావు కళ్ళలోకి నిదానించి చూసిన తులశమ్మకు అతనా మాటలు మనసారా అన్నాడని అర్థమయింది.

ఆనంద బాష్పాలు కనుకొలకులలో నిలవగా అంగీకార సూచకంగా తల ఊపింది.

## 16

డబ్బు చేతిలో పట్టుకుని తనను సమీపించిన రాజారావును చూస్తోనే విషయం ఊహించిన అనిత ఆ డబ్బు ఎలా సంపాదించగలగాడో అని ఆశ్చర్యపోయింది.

"నీ డబ్బు నువ్వు తీసుకో. నా బొమ్మ నా కియ్యి," అన్నాడు.

"ఇంత డబ్బు ఎలా సంపాదించావ్?"

"నీకు వివరించవలసిన అవసరం నాకు లేదు. అయినా వివరిస్తున్నాను. తులశమ్మగా రిచ్చారు."

అనిత పకపక నవ్వుతూ "ఎంత బాగుంది? నా దగ్గిర తీసుకోవటం నీకు అవమానకరమూ, వంట మనిషి దగ్గిర తీసుకోవటం గౌరవమూనా?" అంది.

"ఆవిడ వంటమనిషే కావచ్చు. కానీ మా అమ్మ. అంచేత ఆవిడ దగ్గిర తీసుకోవటం నాకు గౌరవమే?"

అనిత కళ్ళప్పగించి చూసింది.

"నీకు తెలిసిపోయిందా?"

"నీకు ముందే తెలుసా?"

"తెలుసు."

"మరి నా కెందుకు చెప్పలేదు?"

"అహర్నిశమూ సమాజంలో పరువు ప్రతిష్ఠల కోసం పాకులాడే నువ్వు ఈ నిజాన్ని విని భరించలేవని-వారిని స్వీకరించలేకా,పరిత్యజించ లేకా సంఘర్షణలో నలిగిపోతావని."

"అనితా! ఒకనాడు 'లజ్జ పడటం నీకు తెలుసునా?' అని అడిగావు. గుర్తుందా? ఈ నాడు నీ ముందు నిజంగా లజ్జపడుతున్నాను. బహిరంగ సభలలో వర్గ విభేదం వుండరాదని వక్కాణించి కొడుకుకు తమ శాఖలో తప్ప సంబంధం చేయని పెద్దలకు వారసుణ్ణి. భార్యను ఇంటిలో తాళం పెట్టి వేదికమీద స్త్రీ స్వాతంత్ర్యం గూర్చి ఉపన్యసించే మహామహుల శిష్యుణ్ణి. మిథ్యా ప్రతిష్ఠల పేర అనుక్షణమూ ఆత్మవంచనతో జీవించే సమాజానికి చిహ్నాన్ని...."

"బావా!"

"అదంతా నిన్నటివరకు! ఈ రోజునుండీ ప్రతిష్ఠకు నా అర్థం పేరు, లెక్కలేనన్ని గ్రంథాలు చదివి ఏమీ నేర్చుకోలేకపోయాను. ఒక్క మంచి మనసు జీవితానికి అర్థం వివరించింది. ప్రతిష్ఠ ప్రాకులాడి సంపాదించేది కాదు. మన అంతరంగంలో దీపించే దివ్యజ్యోతి."

"బావా! అయితే జానకి...."

"మనతోనే, మనింట్లోనే ఉంటుంది. తులశమ్మగారు కూడా ఇక్కడే ఉంటారు."

"ఈ సమాజం రహస్యంగా సాగినంతవరకు ఎంతటి అవినీతినైనా సహించగలదు. కానీ దాని కట్టుబాట్లకు విరుద్ధంగా ఎవరైనా ధైర్యం చేసి కోరిందిపొందితే మాత్రం సహించదు. పొడిచి పొడిచి బాధిస్తుంది."

"ఆ బాధకు భయపడి నా వారిని వదిలి పెట్టను."

"రమణరావు........"

అనిత చెప్పేది పూర్తి కాకుండానే అడ్డుకున్నాడు రాజారావు.

"జానకి ఉంటే రానంటాడు. స్పష్టంగా చెప్తాను. జానకి కూడా నా చెల్లెలని- అప్పటికీ అర్థం చేసుకోకపోతే మనం ఆ సంబంధం వదులుకోవలసి వుంటుంది. నీ డబ్బు తీసుకో!"

"నీకు గుర్తుందా? నీ మనసులో నా బొమ్మని తీసేయగలిగినపుడు నీ బొమ్మ నీ కిచ్చేస్తానన్నాను. నిజం చెప్పు. నీ మనసులో నా మూర్తి మాసిపోయిందా?"

రాజారావు మాట్లాడలేదు.

"అందుకే ఆ డబ్బు నేను తీసుకోలేను."

"ఆ డబ్బు మీ అమ్మగారు కేవలం నీ కుటుంబం కోసం ఖర్చు పెట్టాలని వీలునామా రాసారట! నా కెందు కిస్తావు? రాణీ తండ్రి కియ్యి!"

విసురుగా డబ్బు అనిత ముందు పడేసి కోపంగా వెళ్ళిపోతున్న రాజారావును చిరునవ్వుతో చూస్తూ కూర్చుంది అనిత.

## 17

రాజారావు చెప్పిన సంగతి విని రమణరావుకు నోట మాట రాలేదు.

కొన్ని క్షణాలు మూఢుడిలా చూస్తూ ఊరుకుని తరువాత అదేదో పెద్ద హాస్య మయినట్లు పకపక నవ్వాడు.

"ఎందుకు నవ్వుతారు?"

చిరాగ్గా అడిగాడు రాజారావు.

"మీ అమాయకత్వానికి నవ్వక ఏడవమంటండీ!"

"ఏడిసినట్టుంది. నా అమాయకత్వం మీ మేధకేం తెలిసిందో సెల వివ్వండి."

వెటకారంగా అన్నాడు రాజారావు.

"కాకపోతే ఏమిటండీ! వితంతువు. వంటలక్క! ఆవిడకి మీ నాన్నగారొక్కరే అని గ్యారంటీ ఏమిటీ? జానకి మీ చెల్లెలే అని ఎలా నమ్మ గలరు?"

"రమణరావుగారూ!"

గర్జించాడు రాజారావు.

"ఇష్టమయితే సుశీలను పెళ్ళి చేసుకోండి. లేకపోతే మానెయ్యండి కానీ మా చెల్లెలిని అవమానిస్తే అసలు వూరుకోను."

"లోకమంతా కోడై కూస్తోంటే ఒక్క నా నోరు మూసి ఏం చెయ్య గలరు?"

"ఆ లోకం నోరూ కట్టిస్తాను. ఏ కోర్టులో జానకి దోషిగా నిలబడ వలసి వచ్చిందో ఆ కోర్టులోనే జానకిని నిర్దోషిగా నిరూపిస్తాను. ఏ తుచ్ఛుడు నా చెల్లెలి జీవితాన్ని నాశనం చేశాడో వాడిని నా చెల్లెలి కాళ్ళమీద పడేయిస్తాను."

రమణరావు ముఖం తెల్లగా పాలిపోయింది. కొన్నిక్షణాలు అతనికి నోటమాటరాలేదు. చివరకు ఎలాగో పెగల్చుకుని "మనలాటి పరువు గల కుటుంబాలు కోర్టుల కెక్కడం ఏం బాగుంటుందీ? అయిన గొడవ చాలదా? జానకి నిర్దోషి అని రుజువు కాకపోతే......."


అని ఏదో అనబోయాడు.

"జానకి నిర్దోషి అని నాకు నమ్మకముంది. నేను రుజువు చెయ్య గలను. ఆ రికార్డంతా స్టడీ చేశాను. తప్పకుండా రుజువు చేస్తాను."

"మీరీ ప్రయత్నం మానెయ్యాలి."

ఆజ్ఞాపిస్తున్నట్లు అన్నాడు రమణరావు.

"మానను. ఎవరు మానమన్నా మానను."




"అయితే మనమధ్య సంబంధం పొసగదు."

"దట్సాల్ రైట్!"

ప్రక్కగదిలో కూర్చుని ఈ సంభాషణంతా వింటున్న కేశవరావుగారు చటుక్కున లేచొచ్చి లేవబోతున్న రాజారావు చెయ్యి పట్టుకున్నాడు.

"అంత తొందరయితే ఎలాగండీ! కూర్చోండి. ఏరా రమణా! మాట యిచ్చి తప్పుతావా? అలాంటిది మన వంశంలో ఉందా?" అని రమణరావును కోప్పడ్డారు.

రమణరావు అయోమయంగా తండ్రివంక చూసి బుద్ధిగా కూర్చున్నాడు.

"మన కుటుంబాలలో యిలాటివి చాలా అరుదు కదండీ! అందుకని మావాడు తొందరపడ్డాడు. ఎప్పుడు తాంబూలాలు తీసుకుందాం?"

ఆ మర్యాదకు రాజారావు తలక్రిందు లయ్యాడు.

"మీ యిష్టం. యెప్పుడైనా నేను సిద్ధమే."

"సాధ్యమయినంత త్వరలో ముహూర్తం నిర్ణయించండి. ముందు తాంబూలాలు తీసుకుందాం!"

"అలాగే!"

వికసించిన ముఖంతో రాజారావు వెళ్ళిపోయాడు.

రమణరావు చిరాగ్గా "ఏవిటి నాన్నా! ఆయన మళ్ళీ కేసు........" అని ఏదో అనబోతుండగా చిరునవ్వుతో వారించాడు కేశవరావు.

"ఓయ్ చవటా! నువ్వు చేసే చవట పన్లన్నీ సర్దుకురాలేక చస్తున్నాను. రాజారావు సమర్థుమయిన లాయరు. ఈ విషయంలో నువ్వు మరీ ఇంత గట్టి పట్టుపడితే అనుమానం రాదూ! అదీగాక నువ్వు పెళ్ళికి వప్పుకుంటే కాబోయే బావమరిదివని నీ మీద ప్రేమ భావం ఉంటుంది. రేపు మా బాబాయి చక్రపాణిగారిని పంపి చూస్తాను. మూడొంతులు లొంగిపోతాడు. అంతకూ లొంగి రాకపోతే చూద్దాం....నువ్వు తొందరపడకు! ఈ కేసు మళ్ళీ తిరగ తోడ్తారని ఎవడు కలగన్నాడు? అందుకే ఆ రికార్డు విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నాను. రాజారావు అప్పుడే దాన్ని చూసే సాడట. అఖండుడు!"

"చూస్తే? నిజం బయట పడుతుందా?"

నిలువెల్లా వణుకుతూ అడిగాడు రమణరావు.

"నిజం అంత తేలిగ్గా ఎలా బయటకొస్తుందోయ్! నేను లేను అడ్డు పడటానికి! ధైర్యంగా ఉండు."

కొడుకు వీపు చరిచారు కేశవరావుగారు.

## 18

"రమణరావుగారు సుశీలను చేసుకోవటానికి వప్పుకున్నారు. తాంబూలాలు తీసుకోవటానికి ముహూర్తం నిర్ణయించమన్నారు."

వికసించిన ముఖంతో రాజారావు చెప్తోంటే అనిత, సుశీల, జానకి, స్థాణువులై పోయారు.

సంభ్రమంతో తల మునకలవుతున్న రాజారావు అది గమనించకుండా తల్లికి విషయం చెప్పటానికి త్వరగా లోపలికెళ్ళి పోయాడు.

ఉద్రేకంతో ఏదో అనబోతున్న అనిత నోరు తన చేత్తో మూసి తన గదిలోకి తీసికెళ్ళింది జానకి.

"అనితా! తొందరపడకు. ఏం చెయ్యదలచుకున్నావ్ నువ్వు?"

"ఇంక ఈ నాటకానికి స్వస్తి చెపుతాను. రాజారావుకు నిజం చెపుతాను."

"నిజం చెప్పగలవు. కాని రుజువు చెయ్యలేవు. అన్నయ్య నీ మాటలు నమ్మగలడు. కానీ నా బ్రతుకు చక్కదిద్దలేడు."

"నీ కేసు పునర్విచారణకు బావ అనుమతి సంపాదించాడు. నిజం రుజువవుతుంది."

"అనితా! ఇంత వెర్రిదానివవుతున్నావేం? అవతలి వ్యక్తులు అంగబలం, అర్థబలం ఉన్నవాళ్ళు. ఆనాడు అమ్మ ప్రయత్నించలేదా? ఏం సాధించ గలిగింది? వాళ్ళు ఎంతకైనా సమర్థులు!"

"అలాంటి నరరూప రాక్షసుడికా, సుశీలను కట్టబెట్టాలనుకుంటున్నావ్? సుశీల క్షేమం ఆలోచించయినా రాజారావుకు అన్ని విషయాలూ చెప్పెయ్యాలి."

"చెపుతావు. అన్నయ్య సుశీల కీ సంబంధం చెయ్యడు. తరువాత ఏమవుతుంది? అంతా నిశ్చయమయ్యాక సంబంధం చెడిపోతే ఆడపిల్లకు పెళ్ళికావటం ఎంత కష్టమో తెలుసా?"



"ఇలాటి పెళ్ళి కావడంకంటే అసలు పెళ్ళి కాకపోటమే మేలు!"

"రమణరావు సుశీల అంటే పడిచస్తున్నాడు. సుఖపెడ్తాడేమో?"

అనితకు మండింది.

"ఆ తరువాత నువ్వెందులోపడి చస్తావ్?"

"నేనేనాడో చచ్చిపోయాను. బ్రతికే ఉన్నానని భ్రమపడుతున్నావు నువ్వు."

"నాన్సెన్స్! నేను........"

"ఆగు అనితా! నా మాట విను. మేమిద్దరమూ ఇక్కడికి రావటం వల్లనే అన్నయ్య అంతులేని చికాకుల్ని ఎదుర్కోవలసివస్తోంది. దానికి మరింత అశాంతిని జోడించటం నా కిష్టంలేదు. రమణరావు నన్ను పది మందిలో అంగీకరిస్తాడని నాకే కోశానా నమ్మకంలేదు. నా బ్రతుకు బాగుపడకపోగా అన్నయ్యకొక పక్కలో బల్లెన్ని సృష్టించిన దాని నవుతాను."

"నీది అర్థంలేని వాదన. పిరికి పలుకులు. ఆత్మవిశ్వాసమనే ఉక్కు కవచం తొడుక్కున్న వాళ్ళని బాణాలూ బల్లేలూ ఏం చెయ్యలేవు. రాజారావుకు విషయం చెప్పేస్తాను."

"అలా చేస్తే నా శవాన్ని మాత్రమే చూస్తావు." అనిత నిర్ఘాంత పోయింది.

"ఏమిటీ మూర్ఖత్వం జానకీ!"

"అన్నయ్య ఎంతో శ్రమపడి తిరిగి కేసు విచారణకు అనుమతి పొందాడుగదా! వేచిచూడు! ఏమాత్రం న్యాయం జరుగుతుందో? అప్పుడు నా మాటలు నీ కర్థమవుతాయి."

జానకి పట్టుదల అర్థంచేసుకున్న అనిత ఇంక వాదించలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుని జేమ్సు కొక ఉత్తరం రాసింది.

"డియర్ జేమ్స్!

ఇక్కడ నేను కొన్ని చిక్కుల్లో యిరుక్కున్నాను. నా అంతట నేను అవి పరిష్కరించుకోలేక పోతున్నాను. నీ సహకారం కావాలి. వెంటనే బయలుదేరి రా!

అనిత......."

ఉత్తరం అందుకున్న వెంటనే వచ్చాడు జేమ్సు.

"మా అమ్మ తరఫు బంధువు. నా కోసం వచ్చాడు."

రాజారావును పరిచయం చేసింది అనిత....

రాజారావు ముభావంగా కరచాలనం చేసాడు.

సుశీల నమస్కారం చేసింది.

'బ్యూటిఫుల్' అనితతో నెమ్మదిగా అన్నాడు జేమ్స్.

జేమ్స్ అన్న దేమిటో వినపడకపోయినా అతను అనిత ముఖం మీదకు వంగి ఏదో అనటం అర్థమయింది రాజారావుకు.

విసురుగా వెళ్ళిపోయాడు.

జేమ్సు ఉంటున్నది హోటల్లో అయినా తరచు అనిత కోసం వచ్చేవాడు.

జేమ్స్ రాగానే చిరాకు పడుతూ సంభాషణ తుంచేసి వెళ్ళిపోయేవాడు రాజారావు.

మొదట్లో బిడియపడినా సుశీల రాను రాను జేమ్స్‌తో సరదాగా మాట్లాడటం నేర్చుకుంది. ముగ్గురికీ కాలం సరదాగా గడిచిపోయేది.

## 19

బంధు మిత్రుల నడుమ సుశీలకు రమణరావుకు పెళ్ళి నిశ్చయం అయింది. తాంబూలాలు తీసుకున్నారు. తరువాత చిన్న అల్పాహార విందు ఏర్పాటు చేసాడు రాజారావు.

విందుకు వచ్చిన పెద్దలు తమ ఎదురుగా ప్లేట్లలో ఉన్న తిను బండారాలతో తృప్తి పడలేకపోయారు. అంతకన్న కమ్మని విందు—జానకి విషయం—వాళ్ళ నోరూరించింది

రకరకాల నోళ్ళు వికటంగా తెరుచుకుని వికృతంగా పలికాయి.

"జానకి మీ చెల్లెలటోయ్!"

"అయితే మీ నాన్నగారు మంచి కథానాయకుడన మాట!"

"ఇంక్కాస్త ఓపిగ్గా కనుక్కోవోయ్! ఇంకా చెల్లెళ్ళూ,తమ్ముళ్ళూ దొరక్కపోరు!"

"మనలో మన మాట! ఈ రాజారావు జానకిని తన పంచన చేర్చుకోవటానికి భాతృ వాత్సల్యమే కారణమంటారా?"

"ఏమోనండీ! ఏం చెప్పగలం! కలికాలం! మండిపోతోంది."

ఈ విషలిప్త వాగ్బాణాలకు తట్టుకోలేకపోయాడు రాజారావు.

విందు ముగిసి అందరూ ఎవరిదారిన వారు వెళ్ళిపోయాక రెండు చేతులలో పగిలిపోతున్న తల నదుముకొని కూర్చున్నాడు.

ఆ మూర్తిని చూసేసరికి జాలితో అనిత హృదయం ద్రవించింది.

"బావా!" అంది ఆప్యాయంగా.

ఎఱ్ఱబడిన కళ్ళతో ఒకసారి అనితను చూసి "కాసేపు నన్ను ఒంటరిగా ఉండనీ!" అన్నాడు విసుగ్గా.

"మనసు కలత పడినప్పుడే మమత పంచుకో గలిగిన వాళ్ళు దగ్గిరుండాలి బావా!"

రాజారావు సమాధానం చెప్పలేదు. అనిత వంక ఆశ్చర్యంగా చూసి తల తిప్పుకున్నాడు.

"ఈ రోజు నిన్ను వెక్కిరించినవాళ్ళందరూ పరమ పవిత్రులూ, ఏ మచ్చా లేనివారు అంటావా?"

"అయినా వాళ్ళు సమాజంలో పెద్ద మనుష్యులుగా చెలామణీ అవుతున్నారు."

"ఈ సమాజపు తీరే విచిత్రమైనది. పబ్లిక్ సీక్రెట్స్ని చక్కగా కడుపులో దాచుకుంటుంది. స్పష్టంగా తెలిసిపోతున్న విషయాలను కష్టపడి నమ్మకుండా ఉంచటానికి ప్రయత్నిస్తుంది. ధైర్యంగా తన కట్టుబాట్లను ఎదిరిస్తే మాత్రం సహించదు. ఇదంతా ముందు ఊహించిందేగా! ఇంత కృంగిపోతే ముందేం సాధించగలవు? జరగవలసిందంతా ముందుంది. జానకిని కోర్టులో నిర్దోషిగా ఋజువు చెయ్యాలి. లే! ధైర్యంగా నిలబడు!"

కర్తవ్యం గుర్తుకొచ్చిన రాజారావు ముఖంలో అలసట మాయమయింది. పట్టుదల ప్రతిఫలించింది.

కన్న వచ్చి "అన్నయ్యా! నీ కోసం చక్రపాణిగారు వచ్చారు," అన్నాడు.

చక్రపాణిగారు కేశవరావుగారికి దగ్గిర బంధువు. డబ్బూ పలుకుబడి రెండూ కలవాడు.

చక్రపాణిగారికి నమస్కారం చేసి కూర్చున్నాడు రాజారావు.

"నిన్ను గురించి విన్నాను కాని చూడలేదోయ్! చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి సమర్థులయిన లాయర్లలో నువ్వొకడివి."

"థేంక్స్."

"నేను మీ నాన్నగారు మంచి స్నేహితులం. అభిమానం చంపుకో లేక వచ్చాను."

రాజారావు అర్థం కానట్లు చూసాడు.

"అదే! నువ్వా జానకి కేసు విషయంలో ఇరుక్కోవటం నాకు నచ్చలేదు. నీ శ్రేయస్సు కది మంచిది కాదు."

"ఈ విషయంలో మీ జోక్యం దేనికి?"

"చెప్పానుగా నీ మీద అభిమానమని?"

నవ్వారు చక్రపాణిగారు. ఆ నవ్వులో లోకంలో కౌటిల్యమంతా కనిపించింది రాజారావుకి-

"జానకి నా చెల్లెలు. జానకిని నిర్దోషిగా ఋజువుచేసి తీరుతాను-"

"జానకిని దోషిగా ఋజువు చేసినా, నిర్దోషిగా ఋజువు చేసినా ఒకటే! జానకిని నాశనం చేసిన వ్యక్తి జానకిని అంగీకరించేలా చెయ్యగలవా నువ్వు?"

"ప్రయత్నిస్తాను-"

"అసంభవం. కోర్టుల కెక్కడంవల్ల వైషమ్యాలు పెరుగుతాయే కాని తగ్గవు. అదీగాక జానకి నిర్దోషి కాకపోతే........"

"చక్రపాణిగారు!"

తీక్షణంగా అన్నాడు రాజారావు.

ఆయన నవ్వారు.

"నీ మనసు తెలుసుకోడానికన్నానోయ్! నిజంగా చెల్లెలిమీద అభిమానముంటే అది చూపించుకునే మార్గం ఇది కాదు. ఎక్కడైన మంచి సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యి. కట్నం ఎర చూపావంటే ఎవడోవకడు దొరక్కపోడు. ఆ విషయంలో కావలంటే నీకు నేను సహాయం చేస్తాను."

రాజారావు అణువణువూ భగ్గుమంది.

"థేంక్స్. మీ సహాయం నాకక్కర్లేదు. నేను చెయ్యగలిగింది నేను చేసుకుంటాను-"

"కేసు విత్‌డ్రా చెయ్యవనమాట!"

"ఒక్కనాటికీ చెయ్యను."

"చివరి మాట! ఈ కేసు విత్‌డ్రా చేసుకుంటే మరొక్క అయిదేళ్ళలో నిన్ను హైకోర్టు జడ్జీని చెయ్యగలను. నాకే పదవి లేకపోయినా, అన్ని పదవులూ నా జేబులో ఉన్న పర్స్‌లో ఉన్నాయి. ఈనాడు అధికారంలో ఉన్న అనేకమంది నా అనుగ్రహంవల్ల అధికారం సంపాదించుకున్న వారే! ఏమంటావ్?" క్రోధంతో జ్వలించిపోతూ వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు రాజారావు.

"నా మాటమీద నమ్మకంలేదా? ప్రస్తుతం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న శంకర్రావు నడుగు. అతని కా పదవి రావటానికి నేనే కారకుణ్ణి."

శంకర్రావు! జానకి కేసులో ఒకనాడు జానకి తరఫున పని చేసిన లాయరు.

రాజారావుకు విషయం అర్థమయింది.

"చక్రపాణిగారూ! అంతటా అవినీతి దట్టంగా అల్లుకుంటోంది. అయినా అక్కడక్కడ నీతి చంద్రికలు విరుస్తోనే ఉన్నాయి. స్వార్థం అతిశయిస్తోంది. అయినా మమత పూర్తిగా మాసిపోలేదు. విషయలాలస విచ్చలవిడిగా నృత్యం చేస్తోంది. అయినా కొన్ని కొన్ని అంతరంగాలు విలువలను మరువటం లేదు.

విశ్వాన్ని ఆవరించుకున్న అంధకారాన్ని ఒక్క కాంతి కిరణం పటాపంచలు చెయ్యగలిగినట్లు పవిత్రాంతః కిరణాలు కొన్నే అయినా జాతిని మేల్కొలిపి ముందుకు నడిపించగలవు."

పకపక నవ్వారు చక్రపాణిగారు.

"నీ కర్మ! నీకే తెలిసివస్తుంది."




వెళ్ళిపోయిన చక్రపాణిగారిని తలచుకుని లోలోపల బీదరించు కున్నాడు రాజారావు.

## 20

**కే**సు విచారణ జరుగుతోంది.

ఆ నాడు జానకిని ఎత్తుకుపోయిన వ్యక్తి కొండయ్య బోనులో నిలబడ్డాడు. రాజారావు క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభించాడు.

"కొండయ్యగారూ! జానకిని మీకు ఎన్నాళ్ళుగా తెలుసు?"

"చాలా రోజులుగా తెలుసు."

"సరిగ్గా చెప్పండి. ఎన్ని సంవత్సరాలనుంచీ తెలుసు?"

"అయిదారేళ్ళనుంచీ తెలుసు."

"మీ రెత్తుకుపోవడానికి ఆరేళ్ళ ముందునుంచీ తెలుసన మాట!"

"నే నెత్తుకుపోలేదు. ఆవిడే నా కారులో వచ్చింది. తరచు నా కారులో వస్తోనే ఉండేది."

"ఆరేళ్ళపాటు మీతో జానకి కారులో తిరిగేదన మాట!"

"ఆ తిరిగేది?"

"మీరు కలిసి తిరగటం ఎవరైనా చూసారా?"

"భలేవారు! ఇలాంటి షికార్లు అందరూ చూసేలా చేస్తారా?"

"మీకు మొదట పరిచయ మయ్యేనాటికి జానకి వయసెంత ఉంటుందీ?"

"సుమారు పదహారు పదిహేడేళ్ళు. ఆడవాళ్ళ వయసు ఎవరు చెప్ప గలరండీ! నలభై దాటాక కూడా పద్దెనిమిదేళ్ళ పిల్లలాగ సింగారించు కుంటున్నారు."

"యువరానర్ చిత్తగించండి. జానకిమీద ఈ కేసు వచ్చిననాటికి జానకి వయసు పదహారేళ్ళు. అప్పటికి అయిదేళ్ళ క్రిందటనుండీ పరి చయమంటున్నారు వీరు! అంటే పదకొండేళ్ళ పసిపిల్లలతో షికార్లు సాగించే రకమనుకోవాలా? ఇవిగో జానకి బర్త్ సర్టిఫికేట్లు...."

కోర్టులో కలకలం బయలుదేరి అంతలో సద్దుమణిగింది.

"ఆ రోజు, అంటే జానకి పోలీసులను పిలిచిన రోజు మీరు జానకిని ఎక్కడ కలుసుకున్నారు?"

"పార్కులో..."

"ఎప్పుడూ అక్కడే కలుసుకునేవారా?"

"ఆ!"

"యువరానర్! ఇది చూడండి. ఇదివరలో జానకి ఇంట్లోనే కలుసు కునే వాడిననీ, ఈ విషయంలో తల్లి ప్రోత్సాహం కూడా ఉందనీ సాక్ష్యం చెప్పారు కొండయ్యగారు!

"కొండయ్యగారు! జానకి మిమ్మల్ని తరచుగా డబ్బు అడిగేదా?"

"అడిగేది!"

"ఇచ్చేవారా"

"సాధ్యమయినంతవరకూ ఇచ్చేవాడిని. ఒక్కసారిగా పదివేలు గుమ్మరించమంటే ఎక్కడ తేను?"

"మిమ్మల్ని జానకి పదివేలు అడిగిందా?"

"అడిగింది. ఇవ్వలేనంటే అల్లరి పెట్టడానికి పోలీసుల్ని పిలిచింది."

"మీ తప్పు లేనపుడు ఎందుకు పారిపోయారు? నిలబడి పోలీసు లతో నిజం ఎందుకు చెప్పలేదు?"

"మొగాడు మొగాడి మాట నమ్ముతాడుటండీ!, ఆడదాని మాట నమ్ముతాడు కాని,—అందుకే భయపడి పారిపోయాను."

"ఎక్కడికి పారిపోయారు?"

"మేడలోకి!"

"మేడా! అదెక్కడుందీ?"

కొండయ్య కంగారు పడ్డాడు.

"మేడంటే మా ఊళ్ళో మేడ! మా ఊరు ఇక్కడికి పదిమైళ్ళు."

"జానకి కూడా మీతోనే ఉందా?"

"ఉంది....మధ్యలో దింపేస్తే పాపం, ఆడపిల్ల ఏమయిపోతుందీ?"

"అందుకని మధ్యలో దింపకుండా పూర్తిగా గంగలో దింపారు."

"రామ! రామ! ఇంటి కెళ్ళగానే మా అమ్మను తోడిచ్చి వాళ్ళింటి దగ్గిర దింపాను."

"ఇదివరలో జానకి 'పోలీస్' అని పిలవగానే భయపడి జానకిని వెంటనే వాళ్ళింట్లో దింపినట్లు చెప్పారు. ఎందుకలా చెప్పారు?"

"ఆ లాయరు అలా చెప్పమన్నాడు. ఈ లాయరు ఇలా చెప్ప మన్నాడు. చావనా? ఇవన్నీ గుర్తు పెట్టుకుందుకు నాకు ఇదే పనా?"

కోర్టులో కలకలం బయలుదేరింది.

"దట్సాల్ యువర్ ఆనర్!" అని కూర్చున్నాడు రాజారావు.

జడ్జీ కొండయ్యను దోషిగా నిరూపించి కిడ్నేపింగ్ నేరం మీద శిక్ష విధించబోతుంటే "ఓ యమ్మో! నాకేం తెలియదు. ఆయన తెమ్మంటే తెచ్చాను," అన్నాడు కొండయ్య.

రాజారావు దిగ్గున లేచి నించున్నాడు.

"ఎవరాయన?"

"పేరు ఊరు నాకేం తెలియదు. మనిషిని చూపిస్తే గుర్తుపడతాను."

కోర్టులో కలకలం బయలుదేరింది. జడ్జి తీర్పు మరునాటికి వాయిదా వేసి లేచారు.

ఆలోచనలతో ఉడికిపోతున్నాడు రాజారావు.

"నిజం బయటపడుతోంది చూశావా?" అంది అనిత.

"ఉండు, ఏం జరుగుతుందో చూడు!" అంది జానకి.

కటకటాలు మూసినవి మూసినట్లుండగానే కొండయ్య మరునాటికి చచ్చిపడి ఉన్నాడు.

జైలు డాక్టర్ 'కొండయ్యకు గుండెజబ్బు ఉందనీ, గుండె ఆగి మరణించాడనీ' సర్టిఫికేట్ ఇచ్చాడు.

రాజారావు తల గిర్రున తిరిగింది.

జానకి కేసులో ఒకే ఒక సాక్షి మరణించాడు. అసలు రహస్యం బయటపడే మార్గమేది?

ఆందోళన పడుతున్న రాజారావుతో "అధైర్యపడకు బావా! ఈ రహస్యం నేను బట్టబయలు చేస్తాను. జానకి బ్రతుకు నాశనం చేసిన దోషిని జానకి కాళ్లమీద పడవేసి తీరుతాను," అంది.

రాజారావు ఆందోళనతో "వద్దు! వద్దు! అనితా? ఈ విషయంలో నువ్వు కలిగించుకోకు!" అన్నాడు.

"ఏం?"

"వాళ్ళెవరో చాలా శక్తిమంతులులా ఉన్నారు. లేకపోతే కటకటాల వెనుక కొండయ్య ఉన్నవాడున్నట్లుగా చచ్చిపోవటం ఎలా సాధ్యం? డాక్టర్‌ను కూడా లొంగదీసుకున్నారు. నువ్వు ఇందులో కలిగించుకోకు. నీ కేమైనా అయితే..." వ్యాకుల స్వరంతో అంటున్న రాజారావును చూసి అల్లరిగా నవ్వి "అయితే నీకేం బాధ? రాణి తండ్రిగారు బాధపడాలి," అంది.

రాజారావు ముఖం పాలిపోయింది.

"నాకు బాధ అని చెప్పటంలేదు. మావయ్యకు సమాధానం చెప్పుకోవాలి నేను."

"మరేం పరవాలేదు. మా నాన్నగారు నన్ను నీ కప్పగించలేదుగా, నిన్ను ప్రశ్నించటానికి?"

"ఛ! ఛ! నీలాంటి మొండిఘటాన్ని ఎక్కడ చూడ లేదు. తరువాత నన్ను సహాయం రమ్మని పిలుస్తే...."

"పిలవను."

"పిలవ్వా?"

"ఎందుకు పిలవటం? నువ్వు పిలవకుండానే వస్తావు" పకపక నవ్వుతో వెళ్ళిపోయింది అనిత.

## 21

అనిత ఇటీవల తరచుగా రమణరావు ఇంటికి వెళ్ళివస్తోంది. అది రాజారావు ఏమాత్రమూ సహించలేకపోతున్నాడు.

జేమ్సుతో కూడా జేమ్సు ఫ్రెండ్ పోలీస్ కమిషనర్ కూడా తరచు రాజారావు ఇంటికి వస్తున్నాడు. అనిత గంటల తరబడి వాళ్లిద్దరితో మాట్లాడుతోంది. రాజారావు సహించలేక "ఇలా అడ్డమైనవాళ్ళూ నా యింటికి రావడం నా కిష్టంలేదు." అన్నాడు తీవ్రంగా.

"వాళ్ళు అన్యాయాలను అడ్డుకొనేవారే తప్ప అడ్డమైన వాళ్లుకారు" అంది అనిత.

"అదంతా నా కనవసరం. వాళ్ళు ఇక మీద నా ఇంటికి రావటానికి వీల్లేదు."

"సరే! నేనే వాళ్ల దగ్గరికి వెళ్లి మాట్లాడతాను."

"అంతవాళ్లతో మాట్లాడవలసిన అవసర మేమిటి నీకు?"

"ఈ ప్రశ్న అడగటానికి నీకేమిటి అవసరం?"

రాజారావు కోపంగా వెళ్లిపోయాడు.

ఒకనాడు అనిత ఒంటరిగా కారులోవస్తూ ఎదురుపడింది.

"ఎక్కడినుంచీ?"

"రమణరావుగారి ఇంటి దగ్గిర నుండి..."

"ఒక్కదానివే వెళ్లావా?"

"రహస్యాలు మాట్లాడటానికి పదిమంది వెళ్తారేమిటీ?"

"రహస్యాలు మాట్లాడటానికా?"

"అవును."

"ఏమిటవి?"

"ఇంత చదువుకున్నావు. రహస్యమంటే అర్థం తెలియదా? చెప్పమని అడుగుతా వేమిటీ?"

పకపక నవ్వి వెళ్లిపోయింది అనిత.

మరొకనాడు కూడా అలాగే ఎదురుపడింది.

"రమణరావు దగ్గిరనుంచేనా?"

కోపంగా అడిగాడు.

"కాదు! కాదు! జేమ్స్ దగ్గిరనుంచి..."

సరిదిద్దింది అనిత.

"ఛీ! ఛీ! ఒక ప్రక్క రమణరావుగారితో, మరొక ప్రక్క జేమ్సుతో........"

"పోలీస్ కమిషనర్‌గారి సంగతి మర్చిపోయావు," అందించింది అనిత.

"ఛ! ఛ! బొత్తిగా సిగ్గులేదు."

"సిగ్గు పడవలసిన వాళ్ళంతా రొమ్ము విరుచుకు తిరుగుతోంటే మధ్యన నన్ను సిగ్గుపడమంటావా? ఇలా ఉంది సమాజం."

"ఛీ! ఛీ! నువ్వంటే నాకు అసహ్యం!"

"నిజంగా?!"

"ముమ్మాటికీ! చెప్పరానంత, భరించలేనంత అసహ్యం. నిన్ను మా ఇంట్లో ఎందుకు అడుగుపెట్టనిచ్చానా అని బాధపడుతున్నాను. ఎప్పుడు విరగడవుతావా, అని జపను చేస్తున్నాను."

"ఎందుకో చెప్పలేను కాని, తపసు చేస్తున్నది నిజమే బావా! ఆ తపసంతా నీ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది."

హుంకరించి విసురుగా వెళ్లిపోయాడు రాజారావు.

## 22

కొండయ్య మరణించటంతో జానకిని నాశనం చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకోవటం కష్టమయిపోయింది రాజారావుకు. అతని మనసు అల్లకల్లోలమయి పోయింది.

అనిత షికార్లు అతని మనసును మరింత మండిస్తున్నాయి. మర్యాదకు భంగమని ఆత్మవంచన చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా మనసును దహిస్తోన్న ఈర్ష్యకు తట్టుకోలేకపోతున్నాడు.

అశాంతితో లైబ్రరీలోకి వచ్చిన రాజారావుకు తన బల్లమీద అనిత దస్తూరితో ఉన్న ఉత్తరం కనిపించింది. ఆతురతతో చదివాడు.

"సుశీలా!

ఊరికి దూరంగా ఉన్న పార్కులోకి అత్యవసరమైన పనిమీద వెళ్తున్నాను. నా కోసం చూడకు. భోజనం చేసెయ్యి. నేను వంటరిగానే వెళ్తున్నాను. అయినా నాకేం భయం లేదు. ఎవరైనా నన్నెత్తుకుపోయినా జానకిని మోసం చేసినట్లు చెయ్యలేరు. నా కోసం చూడకు. భోజనం చేసెయ్యి.

నీ
అనిత...."

కంగారుతో మతి పోయినట్లయింది రాజారావుకు.

తిని కూర్చుని ఆ పార్కుకి ఈ సమయంలో ఎందుకు వెళ్తున్నట్లు?

వంటరిగా వెళ్తోందట.

తనను ఎవరూ ఏమీ చెయ్యలేరట!

ఏదైనా జరిగితే!....

ఆలోచించలేక పోయాడు రాజారావు. వెంటనే స్కూటర్ మీద బయలుదేరాడు. ఆ కంగారులో సుశీలకు రాసిన ఉత్తరం తన బల్లమీదకు ఎలా వచ్చిందనే ఆలోచన కూడా రాలేదు.

అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అంతకంటె వేగంగా వెళ్తోంది స్కూటర్.

అతను పార్కు చేరకుండానే ఏ ఘోరం జరుగుతుందని భయపడ్డాడో ఆ ఘోరం అతని కళ్ళెదురుగానే జరిగిపోయింది. ఎవరో ఇద్దరు అనిత నోట్లో గుడ్డలు కుక్కి కాళ్ళూ చేతులూ కట్టేసి కార్లో పడేసారు. రాజారావు సమీపించేసరికి కారు స్టార్టయిపోయింది.

చేసేది లేక కారును అనుసరించాడు. పోయిపోయి ఒక బంగళాలోకి వెళ్ళింది కారు. రమణరావు ముందు అనిత కట్లు విప్పారు, అనితను తీసుకొచ్చిన వ్యక్తులు.

రమణరావు వికటంగా నవ్వుతూ "జానకిని రక్షిస్తావేం? ముందు నిన్ను నువ్వు రక్షించుకో! రాజారావుకు సంగతంతా చెపుతావు కదూ! చెపుదువు కాని పైలోకంలోంచి చెపుదువు కాని-ఇంతవరకూ నేను హత్యలు చెయ్యలేదు. ఇప్పుడు...."

అనిత మీదకు రాబోతున్న రమణరావు "రమణరావ్!" అన్న గర్జన విని అదిరిపడి ఎదురుగా నించున్న రాజారావును చూసి ఆశ్చర్యపోయాడు.

"రాజారావ్!"

ఒక్క క్షణం భయపడి అంతలో తెగించిన వాడిలా కటువుగా అన్నాడు.

"ఒక్కడుగు ముందుకు వేసావా...."

పిడికిళ్ళు బిగించి ఉగ్రంగా చూశాడు రాజారావు. రమణరావు నిర్లక్ష్యంగా రొమ్ము విరిచాడు.

"ఏం చేస్తావ్?"

చేతిలో పిస్టల్ రాజారావు గుండెలకు గురి పెట్టాడు.

రాజారావు చేతిలో ఏ ఆయుధమూ లేదు. అయినా నిర్భయంగా అనిత ముందు కొచ్చి "నా కంఠంలో ప్రాణముండగా నిన్ను అనిత దగ్గిరకి రానియ్యను." అన్నాడు.

"అయితే సరే! ముందు నీ ప్రాణాలే తీసుకుంటాను. మీ అనిత తిని కూచుని పులిమీసాలతో ఉయ్యాల లూగింది. పులి నోట్లో పడక తప్పుతుందా?"

రమణరావు పిస్టల్ గురిపెట్టాడు.

అది పేలకముందే అనితను కట్టి తెచ్చిన ఇద్దరు వ్యక్తులూ రమణరావు రెండు చేతులూ విరిచికట్టి క్రింద కూలదోసారు. అతని చేతిలో పిస్టల్ ఎగిరి మూల పడింది.

రమణరావుతోపాటు రాజారావు కూడా దిగ్భ్రాంతుడై చూసాడు.

ఆ వ్యక్తు లిద్దరూ తమ ముసుగులు తొలగించారు.

ఒకడు జేమ్సు, రెండవ వాడు జేమ్స్ ప్రాణస్నేహితుడయిన పోలీస్ కమీషనర్.

రమణరావు ముఖం నెత్తురు చుక్క లేకుండా పాలిపోయింది.

పోలీస్ కమిషనర్ అన్నాడు:

"జేమ్స్ మీ గురించి చెపితే నమ్మలేకపోయాను. సమాజంలో పెద్ద మనిషిగా చెలామణి అవుతున్న మీరు ఇంత దారుణం తలపెడతారా, అనుకున్నాను. మీ అనుచరులిద్దరూ ఇప్పటికే జైల్లో ఉన్నారు. మీరు కూడా నడవండి."

రమణరావు అనిత వంక తిరిగి రెండు చేతులూ జోడించాడు.

"బుద్ధి గడ్డితిని ఇలా ప్రవర్తించాను. మీ రెలా చెప్తే అలా వింటాను. నా పరువు కాపాడండి."

"పరువు- ప్రతిష్ఠ!" విరగబడి నవ్వింది అనిత. "మీరంతా ఈ పదాలు భలేగా వాడుకుంటున్నారు."

పాలిపోయిన ముఖాన్ని క్రిందకు దించుకున్నాడు రమణరావు.

"జానకిని పెళ్ళిచేసుకోండి. జానకి ముఖం చూసి మిమ్మల్ని వదిలి పెడతాం. లేకపోతే..."

"చేసుకుంటాను. చేసుకుంటాను. తప్పకుండా చేసుకుంటాను. జానకి బంగారు బొమ్మ. దేవత..."

తాగినవాడిలా భయంతో పేలసాగాడు రమణరావు. నిరసనగా నవ్వింది అనిత.

## 23

"ఎంత సాహసం చేశావు అనితా! ఇప్పటికీ కలో నిజమో నమ్మ లేకుండా ఉన్నాను."

అనితను ఆర్ద్రంగా చూస్తూ అన్నాడు రాజారావు.

అనిత వివరించింది.

"జానకి మెడ్రాస్‌లో నాకు పరిచయమయింది. పరిచయం స్నేహంగా మారింది. అప్పుడే జానకి జాలిగాథ విన్నాను. సమాజంలో ఇటీవల చెల రేగిన అస్థిమితం ఆధారంగా చేసుకుని కొందరు స్వార్థపరులు విజృంభించారు. నానా దుండగాలు చేస్తున్నారు. జానకి మరొక స్నేహితురాలితో కలిసి సినిమా ప్రోగ్రాం పెట్టుకుంది. ఆ స్నేహితురాలి కోసం పార్కులో ఎదురు చూస్తోంది. జానకి దురదృష్టవశాన ఆ రోజు ఆ స్నేహితురాలి ఇంటికి దగ్గిర బంధువులు రావటంవల్ల సినిమాకి రాలేక పోయింది. స్నేహితురాలికోసం ఎదురు చూస్తూ జానకి కూచుంది. చీకటి పడగానే లేచి రాబోయింది. అంతలో దుండగులు జానకిని పట్టుకుని కారులో ఎక్కించుకున్నారు. నిస్సహాయ స్థితిలో జానకి గట్టిగా "పోలీస్! పోలీస్!" అని అరిచింది.

అక్కడున్న పోలీస్ చటుక్కున కారు నంబర్ నోట్ చేసుకుని కేసు రిపోర్టు చేశాడు.

"జానకిని పట్టి తెప్పించిన వ్యక్తి సర్కిల్ ఇనస్పెక్టర్ కొడుకూ డబ్బున్న వాడూ అయిన రమణరావు.

"రమణరావు అతని తండ్రి అతి సులభంగా సాక్ష్యాల్ని కొనుక్కుని కేసును ఎదురు జానకి మీదకే తిప్పారు.

" 'పోలీస్' అని అరిచినందుకు ప్రతిఫలంగా బ్రతుకు నాశనమవటమే కాక బజారు పాలయింది జానకి....

"ఈ గాథ విన్నప్పటినుండీ నా మనసు జానకిపట్ల జాలితో ద్రవించింది. రమణరావు పట్ల కసితో మండింది. ఎలాగైనా రమణరావు జానకిని అంగీకరించేలా చెయ్యాలి. ఇదే నా ఆశయం. ఆ ఆశయసిద్ధి కోసమే వచ్చాను, ఇక్కడికి...."


రాజారావు ఆశ్చర్యంగా విన్నాడు.

"ఇంత తెలిసి నువ్వెందుకు ఆ పార్కుకు వెళ్లావు?"

"నేను కావాలనే వెళ్లాను. జానకి ద్వారానే రమణరావుకు గుణపాఠం నేర్పాలనుకున్నాను. కానీ, అది సాధ్యం కాలేదు. అంచేత నేనే రమణరావు ఇంటికి వెళ్ళి నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. వింటాడా?! విషయమంతా నీకు చెప్పేస్తానని బెదిరించాను—"

"ఋజువులు లేవు. నీ మాటలు రాజారావు నమ్మడు" అన్నాడు.

"నీకు కావాలంటే పదివేలు కట్నంగా ఇస్తాను. జానకిని పెళ్ళి చేసుకో! ఆ అమాయకురాలి బ్రతుకు నాశనం చెయ్యకు." అన్నాను.




కొంచెం ఆలోచించి "ఇక్కడ అందరూ వింటారు. రేపు పార్కులోకి రాగలవా? మాట్లాడుకుందాం!" అన్నాడు.

వెంటనే "సరే!" అన్నాను.

"నేను అమాయకురాలినని అతను మురిసిపోయాడు. అతని అమాయకత్వానికి నేను నవ్వుకున్నాను. నన్ను పార్కులోకి రమ్మన్నప్పుడే రమణరావు ఉద్దేశం అర్థమయిపోయింది నాకు. ముల్లును ముల్లుతోనే తియ్యాలి. మోసాన్ని మోసంతోనే జయించాలి. అధికార దర్పాన్ని అధికారంతోనే అణచాలి. జేమ్స్ మా పినతల్లి కొడుకు. జేమ్స్ కిక్కడి పోలీస్ కమిషనర్ స్నేహితుడని నాకు తెలుసు. అందుకే జేమ్స్‌ని ఇక్కడకు రమ్మని రాసాను. చిన్నతనం నుండీ అన్నా చెల్లెళ్ళలా పెరిగిన వాళ్ళం. బంధువులం. నా మాట కాదనలేక వెంటనే వచ్చాడు.

"రమణరావు నన్ను పట్టుకోడానికి నియమించిన గూండాలను కమిషనర్ అరెస్ట్ చేసారు. వాళ్ళ ద్వారా రమణరావు రహస్యాలన్నీ తెలుసుకున్నారు. తరువాత వాళ్ళే గూండాలలా ముసుగులు వేసుకుని నన్ను తీసుకొచ్చారు. ఆ తరువాత నీకు తెలుసు...."

"ఎంత సాహసం!"

విస్తుపోతూ అన్నాడు రాజారావు.

"చేతిలో ఆయుధం లేకపోయినా, తన ప్రాణాలుపోయినా నా వంటి మీద ఈగ వాలనివ్వని జావ నాకుండగా నాకేం భయం?"

"నేను వస్తానని నీకెలా తెలుసు?"

"ఆ ఉత్తరం చదివాక రాకుండా ఎలా ఉంటావు?"

"నువు ఆ ఉత్తరం రాసింది సుశీలకి కాదా?"

"నువ్వు చదవాలని బల్లమీద పెట్టాను."

"చదివానే అనుకో! ఒకవేళ రాకపోతే?"

"తప్పకుండా వచ్చి తీరుతావు. మీ ఇంటి దగ్గిర నుండి పార్కుకి వచ్చేలోగా మానసికంగా ఎంత కలవరపడి ఉంటావో వూహించగలను."

"ఎలా తెలుసుకున్నావు?"

"ఆడదాన్ని గనుక!"

అల్లరిగా నవ్వింది అనిత—

"నన్ను అపార్థం చేసుకున్నావు కదూ!" అంది కొంటెగా—

"ఏనాడూ చేసుకోలేదు—" గంభీరంగా అన్నాడు రాజారావు.

తెల్లబోయింది అనిత.

"మరి, ఆ మాటలన్నీ……."

"నీ అల్లరి భరించలేక కలిగిన చిరాకు—నువ్వు ఆపదలో చిక్కుకుంటావేమోనని కలిగిన కలవరం. నిర్మలమయిన కళ్ళలోకి చూస్తూ నిన్ను అపార్థం చేసుకో గలిగే శక్తి నాకు లేదు అనితా!"

"రాణిని చూసాక కూడా…."

"ఏం చూసినా, ఎవరు చెప్పినా, నమ్మను. అనిత అల్లరిది-చిలిపిది-కొంటెది-వాలుగాయ—కానీ తెలివి తక్కువది మాత్రం కాదు— ఏ నాడూ ఏ అడుగూ జారనియ్యదు."

అనిత కళ్లు వెలిగాయి—

* * *

ఏ జానకికోసం అనిత ఇంత విశ్వప్రయత్నం చేసిందో ఆ జానకి సమాధానం అందర్నీ దిగ్భ్రాంతుల్ని చేసింది.

"ఇంత ప్రయత్నించి నువ్వు సాధించింది నా మెడలో ఒక తాళి బొట్టు మాత్రమేనా అనితా? ఒక గృహిణిగా నన్ను నిలబెట్టాలని సంఘద్రోహిని సంఘంలో నిలపనిస్తావా? నా ఒక్క దాని ఆనందం కోసం తెలిసి తెలిసి అలాంటి చీడ పురుగును పచ్చని మన కుటుంబాల మధ్య విచ్చల విడిగా వదలి పెట్టమంటావా? ఈనాడు విధిలేక రమణరావు నన్ను భార్యగా అంగీకరిస్తున్నాడు. కానీ నేను మాత్రం ఏ సందర్భంలోనూ అతడిని నా భర్తగా అంగీకరించలేను. లోకమంటే తెలియని నా రాణిని ఆ విషవాయువుల మధ్య పెంచటం నా కిష్టంలేదు.'

"రాణి నీ కూతురా?"

ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

"అవు నన్నయ్యా! ఈ ఊళ్ళో రేగిన అలజడికి భయపడి మెడ్రాస్ పారిపోయాను. ఆనాడు అనిత 'నీది కాని తప్పుకు నువ్వు భయపడి పారిపోతున్నావు. నన్ను చూడు! సమాజాన్ని ఎలా ఎదుర్కొంటానో?' అని, నన్ను, రాణిని తనతో తీసుకొచ్చింది."

జేమ్స్, పోలీస్ కమిషనర్ ఇద్దరూ జానకిని అభినందించారు.

"అనితగారు విడుదల చెయ్యమని కోరినా, నేను రమణరావుని అరెస్ట్ చెయ్యకుండా ఉండలేకపోయాను. అది నా విధి. ఈ వార్త మీతో ఎలా చెప్పాలా అని మథన పడుతున్నాను. జానకిగారు నాకు శ్రమ తప్పించారు."

జానకిని జాలిగా చూస్తూ అన్నాడు పోలీస్ కమిషనర్. అందరి దగ్గిరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

"నువ్వేం చెయ్యదలచుకున్నావు జానకీ?" అనిత అడిగింది.

"నాకు డాక్టర్ని కావాలని ఉంది. కాని అది సాధ్యపడదు. ఏదైనా ఉద్యోగం సంపాదించుకుంటాను."

తులశమ్మ తన కిచ్చిన డబ్బు జానకి చేతిలో పెట్టింది అనిత.

"నువ్వు మెడిసిన్ చదువు. కనీసం ఇదైనా సాధించు," అంది.

"అనితా……"

జానకి ఏదో అభ్యంతరం చెప్పబోతుండగానే అనిత అడ్డుకుంది.

"అది మీ నాన్నగారి డబ్బు. న్యాయంగా దానిమీద అధికారం నీదే! కదు బావా!"

"అవును. జానకీ! ఆ డబ్బు నువ్వు తీసుకుని మెడిసిన్ చదువు. నాకూ కాస్త ఊరట కలుగుతుంది."

రాజారావు ఆమోదంకూడా లభించటంతో జానకి మళ్ళీ అభ్యంతర పెట్టలేదు.

అనితను ఏకాంతంలో కలుసుకుని రాజారావు "ఆ డబ్బు మీ అమ్మగారు నీ కిచ్చారు. కేవలం నీ కుటుంబానికే వినియోగపడాలని విల్లులో రాసారు. నువ్వు మా క్రింద ఖర్చు పెడుతున్నావు," అన్నాడు.

"ఈ ఇంట్లో అడుగుపెట్టిన మరుక్షణంనుంచీ ఇది నా కుటుంబంగానే భావించాను బావా!"

అనిత సిగ్గుపడటం మొదటిసారిగా చూసాడు రాజారావు. ముగ్ధుడయ్యాడు.

"కానీ, అనితా! నేను అనేక బాధ్యతలు మోస్తున్నవాడిని. సుశీలకు పెళ్ళి చెయ్యాలి. అప్పులు తీర్చాలి."

"మా జేమ్స్ మీ సుశీలను- సారీ మన సుశీలను చాలా ఇష్టపడుతున్నాడు. నీ కభ్యంతరం లేకపోతే…."

"సంతోషంగా వాళ్ళ వివాహానికి ఒప్పుకుంటాను."

"ఒక బాధ్యత తీరిపోయినట్లేగా! నీ మిగిలిన బాధ్యతలు నీతో నేనూ పంచుకుందా మనుకుంటున్నాను. నాకు ఆ అవకాశం ఇయ్యవా?"

చిరునవ్వుతో చేతులు జాపాడు రాజారావు.

ఆ చేతులలో వాలిపోయింది అనిత.

